ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా, నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు


SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 140 శనివారం 09 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 139 Saturday 09 - 05 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

# దేశంలోని గొప్ప పరిశ్రమలన్నీ తీసుకొస్తున్నాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కొడంగల్‌లో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- గొప్ప పరిశ్రమలన్నీ కొడంగల్‌కు తీసుకొస్తున్నాం
- కొడంగల్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భూమిపూజ
- కొడంగల్‌లో రాజకీయాలు పక్కనపెట్టి పని చేద్దామని పిలుపు



**వార్త సంధ్య, హైదరాబాద్, మే 08 :** దేశంలోనే గొప్ప ఆగమ శాస్త్ర సలహాదారులు సుందరవరదాచార్యులని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. సుందరవరదాచార్యులు పేరును కొడంగల్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏదో ఒక ప్రాంగణానికి పెడతామని వెల్లడించారు. తన సొంత నియోజకవర్గంలో పర్యటించిన రేవంత్ రెడ్డి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కొడంగల్‌లో రూ.110 కోట్లతో పునర్నిర్మాణం చేయనున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆయన భూమి పూజ చేశారు.రాష్ట్రం గర్వించదగిన గొప్ప కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించామని రేవంత్ రెడ్డి తెలిపారు. కొడంగల్ నియోజకవర్గానికి ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని గుర్తు - మిగతా 2 లో

## ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయి



- అడ్డదారులు తొక్కొద్దు
- యువతకు కొండా సురేఖ సూచన
- వరంగల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించిన ప్రభుత్వం
- యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దన్న కొండా సురేఖ
- ఎన్ని ప్రయత్నాలు విఫలమైనా ఉద్యోగ ప్రయత్నాలు ఆపొద్దన్న కడియం కావ్య

**వార్త సంధ్య, వరంగల్ , మే 08 :** వరంగల్‌లోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య చేసిన ప్రసంగాలు నిరుద్యోగులకు దిశానిర్దేశం చేశాయి. - మిగతా 2 లో

## బీఆర్ఎస్ లిఫ్ట్ విధానం వల్ల రాష్ట్రంపై భారం పడింది


2 లో

- తెలంగాణ పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- తుమ్మిడిహట్టి ద్వారా గ్రావిటీ ద్వారా నీరు అందించే అవకాశం ఉందన్న జూపల్లి
- దాన్ని పక్కన పెట్టి కాళేశ్వరంను ఎంచుకున్నారని విమర్శ
- మేడిగడ్డ నిరుపయోగంగా మారిందని వ్యాఖ్య

## పుదుచ్చేరిలో ఐదోసారి సీఎం అవుతున్న రంగస్వామి

- పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి ఘన విజయం
- 5 స్థానాలకు పరిమితం అయిన డీఎంకే
- 12 చోట్ల విజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించిన రంగస్వామి పార్టీ



**వార్త సంధ్య, పుదుచ్చేరి , మే 08 :** పుదుచ్చేరి సీఎం రంగస్వామి చరిత్రపుట్లోలకి ఎక్కబోతున్నారు. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించడంతో, రంగస్వామి ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. మొత్తం 30 స్థానాలున్న అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు 16 స్థానాలు అవసరం కాగా, ఎన్డీయే కూటమి 18 స్థానాలను (ఏఐఎన్ఆర్సీ-12, బీజేపీ-4, స్వతంత్రులు-2)

కైవసం చేసుకుని స్పష్టమైన మెజారిటీని దక్కించుకుంది. రంగస్వామి నేతృత్వంలోని ఏఐఎన్ఆర్సీ 16 స్థానాల్లో పోటీ చేసి 12 చోట్ల విజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించింది. డీఎంకే 5, కాంగ్రెస్ ఒక్క స్థానానికి పరిమితం అయ్యాయి.

పుదుచ్చేరి రాజకీయాల్లో అత్యంత సామాన్యుడిగా, మృదుభాషిగా పేరున్న రంగస్వామిని ఎమ్మెల్యేలందరూ తమ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో, త్వరలోనే ఆయన ఐదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ విజయం రంగస్వామి వ్యక్తిగత ఇమేజ్‌కు నిదర్శనం మాత్రమే కాకుండా, పుదుచ్చేరిలో ఎన్డీయే పట్టును మరింత బలోపేతం చేసింది.

## కేరళలో భూమిలోంచి బయటపడిన అరుదైన 'నేల మామిడి'

- కేరళలోని పాలక్కాడ్ జిల్లాలో అరుదైన 'నీలమాంగ' ఫంగస్ వెలుగులోకి
- చూడటానికి మామిడి పండులా ఉండటంతో దీనికి 'ఎర్త్ మ్యాంగో' అని పేరు
- స్థానికులు దీన్ని సాంప్రదాయ వైద్యంలో పలు రోగాలకు ఉపయోగిస్తారు
- ఇది భూమి లోపల పెరిగే ఫంగస్, శాస్త్రీయ నామం స్క్లెరోటియం స్టిపిటాటం
- ఈ ఆవిష్కరణ ఫంగల్ జీవవైవిధ్య పరిరక్షణ ఆవశ్యకతను గుర్తు చేస్తోన్న వైనం

**వార్త సంధ్య, కేరళ, మే 08 :** కేరళలోని పాలక్కాడ్ జిల్లాలో ఓ రైతుకు తన పొలంలో అరుదైన ఫంగస్ జాతి లభ్యమైంది. కరకురుస్సి గ్రామంలో భూమిని సాగు కోసం తవ్వుతుండగా, మామిడి పండ్ల ఆకారంలో ఉన్న సుమారు 20 వింత ఆకృతులు బయటపడ్డాయి. స్థానికంగా 'నీలమాంగ' లేదా 'ఎర్త్ మ్యాంగో' (నేల మామిడి)గా పిలిచే ఈ ఫంగస్ గురించి తెలియగానే శాస్త్రవేత్తలు, జీవవైవిధ్య నిపుణులు ఆసక్తి కనబరిచారు. - మిగతా 2 లో


2 లో

## హైదరాబాద్‌లో ప్రధాని మోదీ పర్యటన డ్రోన్లు, పారా గ్లైడర్లను ఎగురవేయడం నిషేధం


2 లో


- ఆ ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేయవద్దు!
- హైదరాబాద్‌కు రానున్న ప్రధాని మోదీ
- బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఆంక్షలు
- నేటి అర్ధరాత్రి నుంచి 24 గంటల పాటు అమల్లో ఆంక్షలు

## తెలంగాణ ప్రభుత్వం పలు కులాల పేర్లు మారుస్తూ కీలక నిర్ణయం

2 లో

- కీలక నిర్ణయం తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం
- సామాజిక సంస్కరణల దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు
- దొమ్మర, పిచ్చకుంట్ల తదితర కులాల పేర్ల మార్పు
- మరికొన్ని కులాలకు గౌరవప్రదమైన పర్యాయపదాలను జోడించిన ప్రభుత్వం


## ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న హంటా వైరస్



- ఇది కోవిడ్, ఇన్‌ఫ్లుయెంజా వంటిది కాదు... ఇది వేరే!
- హంటా వైరస్ పై డబ్ల్యూహెచ్ఓ
- ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న హంటా వైరస్
- దీని వ్యాప్తి కరోనా వైరస్ కు పూర్తిగా భిన్నమన్న డాక్టర్ మరియా కెర్ఖోవ్
- సన్నిహిత సంబంధాలు ఉన్న వ్యక్తుల మధ్యే వ్యాపిస్తుందని వెల్లడి

**వార్త సంధ్య, ఢిల్లీ , మే 08 :** ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న హంటా వైరస్ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ కీలక స్పష్టతనిచ్చింది. ముఖ్యంగా ఇది కోవిడ్-19 తరహాలో మళ్లీ లాక్‌డౌన్‌లకు దారితీస్తుందా? మాస్కులు ధరించాలా? అనే సందేహాలకు నిపుణులు సమాధానమిచ్చారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఎపిడెమిక్ అండ్ పాండమిక్ మేనేజ్మెంట్ డైరెక్టర్ - మిగతా 2 లో

## రాయలసీమ ఇక రాయల్ సీమ




- సీఎం చంద్రబాబు ఆసక్తికర పోస్ట్
- ఏపీకి రానున్న ప్రముఖ బైక్ తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్
- తిరుపతి జిల్లా సత్యవేడులో రూ. 2,200 కోట్ల పెట్టుబడి
- 'రాయలసీమ ఇప్పుడు రాయల్ సీమ' అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్
- ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 5,000 మందికి ఉపాధి అవకాశాలు

**వార్త సంధ్య, అమరావతి, మే 08 :** ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ ఏపీలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. తిరుపతి జిల్లాలో సుమారు రూ. 2,200 కోట్ల వ్యయంతో మోటార్‌సైకిళ్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం ఈ ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేసింది.ఈ శుభవార్తను సీఎం చంద్రబాబు తనదైన శైలిలో సోషల్ మీడియా వేదికగా - మిగతా 2 లో


## ఇక 24 గంటల్లోనే వాహన రిజిస్ట్రేషన్


2 లో

- ఆలస్యమైతే ఆటో అప్రూవల్!
- రిజిస్ట్రేషన్ల జాప్యంపై చంద్రబాబు ఆదేశాలతో కొత్త విధానం
- ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 27 వేల రిజిస్ట్రేషన్లు
- త్వరలో ప్రభుత్వ ఆమోదంతో అమల్లోకి రానున్న కొత్త రూల్

## అంతర్జాతీయ విద్యాభ్యాసానికి పావలా వడ్డీకే రుణాలు

- విద్యార్థులకు అండగా చంద్రబాబు ప్రభుత్వం
- జాతీయ, అంతర్జాతీయ విద్యకు పావలా వడ్డీకే రుణాలు
- కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు
- ఆగస్టు 15 నాటికి 2.5 లక్షల ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు
- బుడగజంగాలకు ఎస్సీలకు వర్తించే అన్ని ప్రయోజనాలు వర్తింపు
- సూపర్ సిక్స్, ఇతర సంక్షేమ పథకాల అమలుపై సీఎం సమీక్ష




**వార్త సంధ్య, అమరావతి, మే 08 :** ఆంధ్రప్రదేశ్‌లోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన విద్యాసంస్థల్లో చదువుకునేందుకు వీలుగా పావలా వడ్డీ (25 పైసల వడ్డీ)కే విద్యా రుణాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఏడవ జిల్లా కలెక్టర్ల సమావేశంలో భాగంగా సంక్షేమ పథకాలపై సమీక్ష సందర్భంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ వంటి జాతీయ సంస్థలతో పాటు విదేశాల్లోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీలలో చదవాలనే విద్యార్థుల కలలు సాకారం కానున్నాయి.కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలని, వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ప్రఖ్యాత సంస్థల్లో సీట్లు సాధించేలా చూడాలని సూచించారు. విదేశాల్లో ఉద్యోగాలు సాధించేందుకు వీలుగా ఎస్సీ, ఎస్టీ యువతకు జర్మన్ భాషలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని, యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించి, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం ద్వారా వారి - మిగతా 2 లో

# సంపాదకీయం

## లక్ష్యాన్ని వదిలేయొద్దు



ప్రపంచంలో ప్రతి గొప్ప ప్రయాణం ఒక చిన్న ఆలోచనతోనే ప్రారంభమవుతుంది. ఒక వ్యాపారం, ఒక కంపెనీ, ఒక స్వచ్ఛంద సంస్థ లేదా ఏదైనా ఉద్యమం ఇవన్నీ మొదట ఒక లక్ష్యంతో, ఒక అవసరంతో, ఒక కలతో మొదలవుతాయి. ఆ ప్రారంభంలో ఉండే ఆశయం, సమాజానికి ఉపయోగపడాలనే తపన, ఏదో సాధించాలనే పట్టుదలే ఆ సంస్థకు నిజమైన పునాది. ప్రారంభ దశలో ఎదురయ్యే కష్టాలు మనిషిని మరింత దృఢంగా మారుస్తాయి. కానీ ప్రయాణం ముందుకు సాగేకొద్దీ పరిస్థితులు మారుతాయి. కొత్త వ్యక్తులు పరిచయం అవుతారు. అవకాశాలు పెరుగుతాయి. కొన్నిసార్లు లాభాలు, పేరు, ప్రాధాన్యతలు కూడా మారిపోతాయి. ఈ మార్పుల మధ్య చాలా మంది మొదట ప్రారంభించిన అసలు లక్ష్యాన్ని మర్చిపోతారు. స్వచ్ఛంద సంస్థ ప్రారంభంలో చేసే కార్యక్రమాల వలననే గుర్తింపు వస్తుంది. సంస్థకైనా, వ్యక్తులకైనా అదే మొదటి ముద్ర. ప్రజల మధ్య నమ్మకం, గౌరవం, ఆదరణ కూడా ఆ సేవా కార్యక్రమాల ద్వారానే ఏర్పడతాయి. కానీ చాలా సందర్భాల్లోడ గుర్తింపు వచ్చిన తర్వాత మొదట ప్రారంభించిన సేవలను, ఆశయాలను, లక్ష్యాలను మరిచిపోతుంటారు. ప్రచారం పెరిగేకొద్దీ సేవ తగ్గిపోవడం, పేరు పెరిగేకొద్దీ బాధ్యత తగ్గిపోవడం, ఇది నేటి సమాజంలో కనిపిస్తున్న బాధాకరమైన నిజం. నిజమైన సేవ అనేది గుర్తింపుకు కాదు.. కానీ ప్రారంభమై గుర్తింపు వచ్చిన తర్వాత ఆగిపోవడం కాదు. ప్రజల అవసరాలు ఉన్నంత వరకు అదే అంకితభావంతో కొనసాగించడమే అసలైన సేవా ధర్మం. ఒక సంస్థ గొప్పతనాన్ని నిర్ణయించేది దాని ప్రారంభ వేడుకలు కాదు కాలం గడిచినా అదే నిబద్ధతతో కొనసాగించే సేవా కార్యక్రమాలే. "ప్రారంభించిన సేవను నిలబెట్టుకోవడండ అదే అసలైన సామాజిక బాధ్యత." వ్యాపారం అంటే కేవలం డబ్బు సంపాదించడం మాత్రమే కాదు. అది ఒక బాధ్యత. కంపెనీ అంటే కేవలం ఉద్యోగాల కల్పన కాదు; అది ఒక ఆలోచనకు రూపం. స్వచ్ఛంద సంస్థ అంటే కేవలం సేవ కార్యక్రమాలు కాదు;, సమాజంపై ఉన్న బాధ్యతను కార్యరూపంలో చూపించడం. అందుకే ఏ సంస్థ అయినా తన ప్రారంభ ఉద్దేశ్యాన్ని ఎప్పటికీ వదిలేయకూడదు. మార్పులు రావడం సహజం. కాలానికి అనుగుణంగా విధానాలు మారవచ్చు. పని చేసే పద్ధతులు మారవచ్చు. కానీ లక్ష్యం, దృక్పథం మారకూడదు. ఎందుకంటే లక్ష్యాన్ని కోల్పోయిన సంస్థ బయటకు ఎంత పెద్దదిగా కనిపించినా, లోపల ఖాళీగా మారిపోతుంది. చరిత్రలో నిలిచిపోయిన ఎన్నో గొప్ప సంస్థలు తమ మొదటి విలువలను గౌరవించాయి. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాయి. అందుకే అవి కాలంతో పాటు ఎదిగినా, తమ అసలు ఉద్దేశ్యాన్ని మరువలేదు. అదే వాటి విజయ రహస్యం. ఒక వ్యక్తి గానీ, ఒక సంస్థ గానీ ఎత్తులకు ఎదగడం గొప్ప విషయం. కానీ ఎందుకు ప్రారంభించామో గుర్తుంచుకుని ముందుకు సాగడం ఇంకా గొప్ప విషయం. ఎందుకంటే లక్ష్యం ఉన్న ప్రయాణానికి దిశ ఉంటుంది. ఆ దిశే విజయాన్ని నిలబెడుతుంది. కాబట్టిడ ఎన్ని మార్పులు వచ్చినా, ఎంత ఎదిగినా, ఎంత పేరు సంపాదించినాడ ప్రారంభించిన లక్ష్యాన్ని ఎప్పటికీ వదిలేయొద్దు.

వై. సంజీవ కుమార్,
ఫౌండర్ & ప్రెసిడెంట్,
స్కై ఫౌండేషన్ & స్కై ఫౌండేషన్ ట్రస్ట్,
9393613555 / 9493613555

## రాయలసీమ ఇక రాయల్ సీమ

**మొదటిపేజీ తరువాయి -** ప్రకటించారు. "రాయల్ ఎన్‌ఫీల్డ్ రాయలసీమలోకి దూసుకుపోతోంది! రాయలసీమ ఇప్పుడు రాయల్ సీమ" అనే క్యాప్షన్‌తో ఓ బుల్లెట్ బైక్ ఫొటోను ఆయన పంచుకున్నారు. ఈ ట్వీట్ కొద్దిసేపట్లోనే వైరల్‌గా మారింది.తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలోని వన్నెలూరు, రాళ్ళకుప్పం గ్రామాల్లో ఈ పరిశ్రమ కోసం ప్రభుత్వం 267 ఎకరాల భూమిని కేటాయించింది. రెండు దశల్లో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొదటి దశను 2029 నాటికి, రెండో దశను 2032 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ఇక 24 గంటల్లోనే వాహన రిజిస్ట్రేషన్

**మొదటిపేజీ తరువాయి -** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై కేవలం 24 గంటల్లోనే శాశ్వత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికానుంది. ఈ మేరకు రవాణా శాఖ రూపొందించిన కొత్త విధానానికి ఈ వారంలోనే ప్రభుత్వం ఆమోదం తెలిపే అవకాశం ఉంది.వాహనాల రిజిస్ట్రేషన్‌లో జరుగుతున్న జాప్యంపై ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతో రవాణా శాఖ ఈ కొత్త విధానాన్ని ప్రతిపాదించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 27 వేల వాహనాలు శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం పెండింగ్‌లో ఉన్నాయి.కొత్త విధానం ప్రకారం డీలర్ తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన 24 గంటల్లోపు రవాణా శాఖ అధికారులు శాశ్వత రిజిస్ట్రేషన్‌ను ఆమోదించాలి. ఫ్యాన్సీ నంబర్లు కోరుకునే వారికి ఈ నిబంధన వర్తించదు. ఒకవేళ అధికారులు గడువులోగా ఆమోదం తెలపడంలో విఫలమైతే సిస్టమ్ ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్‌కు ఆమోదం తెలుపుతుంది. సెలవు రోజుల్లో కూడా అధికారులు ఆన్‌లైన్‌లో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు.తొలుత శాశ్వత రిజిస్ట్రేషన్ అధికారాన్ని డీలర్లకే అప్పగించాలని సీఎం సూచించినప్పటికీ, న్యాయపరమైన చిక్కులు రావొచ్చని అధికారులు వివరించారు. దీంతో రిజిస్ట్రేషన్ అధికారాన్ని రవాణా శాఖ వద్దే ఉంచి, 24 గంటల కాలపరిమితితో కూడిన విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ దస్త్రం ప్రభుత్వ ఆమోదం పొందగానే కొత్త విధానం అమల్లోకి రానుంది.

## హైదరాబాద్‌లో ప్రధాని మోదీ పర్యటన

**మొదటిపేజీ తరువాయి -** మే 10 ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటించనున్నారు. రాష్ట్రంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొంటారు. మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసులు హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు.బేగంపేట, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రేపు అర్ధరాత్రి 12 గంటల నుంచి 24 గంటల పాటు డ్రోన్‌లు, పారాగ్లైడర్‌లు, రిమోట్ కంట్రోల్ మైక్రో లైట్ విమానాలు ఎగురవేయడాన్ని నిషేధించారు. ఈ మేరకు మల్కాజ్‌గిరి పోలీసులు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో పౌరులు ఆంక్షలను పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

## బీఆర్ఎస్ లిఫ్ట్ విధానం వల్ల రాష్ట్రంపై భారం పడింది




**మొదటిపేజీ తరువాయి -** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న తెలంగాణ పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రధానంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన సాగునీటి విధానాలపై విమర్శలు గుప్పించారు. సహజసిద్ధమైన ప్రవాహం (గ్రావిటీ) ద్వారా నీటిని అందించే అవకాశమున్న తుమ్మిడిహట్టిని పక్కన పెట్టి, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా విద్యుత్ ఖర్చుతో కూడిన 'లిఫ్ట్' విధానాన్ని ఎంచుకోవడం వల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడిందని ఆయన మండిపడ్డారు. 2008లో వైసీపీ హయాంలో 16 లక్షల ఎకరాల లక్ష్యంతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టును కాళేశ్వరం పేరుతో రీ-డిజైన్ చేయడం వల్ల సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి ప్రాంతాల రైతులకు అన్యాయం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోవడంతో ప్రస్తుతం ఆ ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తుమ్మిడిహట్టిని పూర్తి చేయడానికి సిద్ధంగా ఉందని జూపల్లి స్పష్టం చేశారు. 150 మీటర్ల బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించే ప్రయత్నం చేస్తామని, దీనివల్ల పొరుగు రాష్ట్రంలో ముంపు సమస్య ఉండదని ఆయన వివరించారు.

## అంతర్జాతీయ విద్యాభ్యాసానికి పావలా వడ్డీకే రుణాలు




**మొదటిపేజీ తరువాయి -** జీవన ప్రమాణాలను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.సూపర్ సిక్స్ పథకాల అమలు, లబ్ధిదారుల ఇంటిగ్రేషన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు విస్తృతంగా సమీక్షించారు. 'తల్లికి వందనం' ద్వారా 67 లక్షల మందికి రూ.10 వేల కోట్లు అందిస్తున్నామని, 'స్త్రీశక్తి' పథకం కింద మహిళలు ఇప్పటివరకు 60.6 కోట్ల ప్రయాణాలు చేశారని, దీనికోసం ప్రభుత్వం ఏటా రూ.1940 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. 'దీపం 2.0' కింద 1.08 కోట్ల మంది లబ్ధిదారులకు రూ.3504 కోట్లు అందజేశామన్నారు. మే 19న మత్స్యకారుల కోసం రూ.286 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. బుడగజంగాలను ఎస్సీలలో చేర్చాలన్న డిమాండ్‌పై కేంద్రంతో చర్చిస్తామని, కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోపు ఉద్యోగాలు మినహా ఎస్సీలకు వర్తించే అన్ని సంక్షేమ ప్రయోజనాలను వారికి వర్తింపజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇది వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది. రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోందని సీఎం తెలిపారు. ఆగస్టు 15 నాటికి 2.50 లక్షల ఇళ్లకు, డిసెంబర్ నాటికి మరో 2.38 లక్షల ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2027 డిసెంబర్ నాటికి మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, కొండ ప్రాంతాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించాలని, దీనివల్ల ఒక్క విజయవాడలోనే 60 వేల మందికి, విశాఖలో 30 వేల మందికి లబ్ధి చేకూరుతుందని అన్నారు.ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేలా అధికారులు పనిచేయాలని సీఎం సూచించారు. ముఖ్యంగా విద్య, వైద్యం, విద్యుత్ ఖర్చులు తగ్గించేలా చొరవ చూపాలన్నారు. భూవివాదాలను పరిష్కరించడంలో భాగంగా వచ్చే కలెక్టర్ల సమావేశం నాటికి 22ఏ కింద ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 2027 మార్చి నాటికి భూ రీసర్వే ప్రక్రియ పూర్తి చేసి, పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ల సమావేశాలు, సమీక్షలు కేవలం ప్రజల సంక్షేమం కోసమేనని, ప్రతి అధికారి ఈ విషయాన్ని గుర్తుంచుకుని పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న హంటా వైరస్



**మొదటిపేజీ తరువాయి -** డాక్టర్ మరియా వాన్ కెర్ఖోవ్ స్పందిస్తూ, హంటా వైరస్ కోవిడ్ లేదా ఇన్‌ఫ్లుయెంజా వంటిది కాదని, దీని వ్యాప్తి విధానం పూర్తిగా భిన్నంగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఒక క్రూయిజ్ షిప్‌లో కనిపిస్తున్న ఈ వైరస్ క్లస్టర్, కేవలం పరిమిత పరిధిలో, సన్నిహిత సంబంధాలు ఉన్న వ్యక్తుల మధ్య మాత్రమే వ్యాపిస్తోందని తెలిపారు. గతంలో 2018-19లో అర్జెంటీనాలో వచ్చిన 'ఆండీస్ వైరస్' తరహాలోనే ఇది కూడా ఒక పరిమితమైన వ్యాప్తిగానే ఉంటుందని, ఇది పెద్ద మహమ్మారిగా మారే అవకాశం లేదని ఆమె ధీమా వ్యక్తం చేశారు.హంటా వైరస్‌కు, కోవిడ్-19కు మధ్య ఉన్న అతిపెద్ద వ్యత్యాసం అవి వ్యాపించే విధానం. కోవిడ్-19 గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి చాలా వేగంగా వ్యాపించే శ్వాసకోశ వైరస్. కానీ, హంటా వైరస్ ప్రధానంగా జూనోటిక్ వ్యాధి (జంతువుల నుంచి మనుషులకు వచ్చేది). ఇది ఎలుకల మూత్రం, మల విసర్జితాలు లేదా లాలాజలం ద్వారా మనుషులకు సోకుతుంది. మనుషుల నుంచి మనుషులకు ఈ వైరస్ వ్యాప్తి చెందడం చాలా అరుదు. కేవలం 'ఆండీస్ స్ట్రెయిన్' విషయంలో మాత్రమే సన్నిహిత సంబంధాలు ఉన్నవారి మధ్య వ్యాప్తి కనిపిస్తుంది. కోవిడ్ అంత వేగంగా ఇది వ్యాపించదు కాబట్టి, పెద్ద ఎత్తున మహమ్మారిగా మారే ప్రమాదం తక్కువని నిపుణులు చెబుతున్నారు.వ్యాధి సోకిన వారితో కాంటాక్ట్ ట్రేసింగ్, ఐసోలేషన్ వంటి ప్రజారోగ్య చర్యలు పాటించడం ద్వారా ఈ వైరస్ గొలుసును సులభంగా తెంచవచ్చని డాక్టర్ అబ్దిరహ్మాన్ మహమూద్ పేర్కొన్నారు. హంటా వైరస్ కేసుల వారీగా చూస్తే కోవిడ్ కంటే ఎక్కువ ప్రాణాం తకమైనది అయిన ప్పటికీ, అది సమర్థవం తంగా వ్యాపించలేదు కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన వివరించారు. ఈ వైరస్ యొక్క ఇంక్యుబేషన్ పీరియడ్ (వైరస్ సోకిన తర్వాత లక్షణాలు బయటపడే సమయం) ఆరు వారాల వరకు ఉండవచ్చని, అందుకే మరికొన్ని కేసులు వచ్చే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అథానమ్ గెబ్రియేసస్ తెలిపారు.

## కేరళలో భూమిలోంచి బయటపడిన అరుదైన 'నేల మామిడి'




**మొదటిపేజీ తరువాయి -** శాస్త్రీయంగా దీన్ని 'స్క్లెరోటియం స్టిపిటాటం'గా గుర్తించారు. సాధారణంగా వర్షాకాలంలో పుట్టగొడుగులు భూమి పైకి వస్తాయి. కానీ ఈ 'నేల మామిడి' ఫంగస్ దానికి భిన్నంగా, ఎక్కువ భాగం భూమి లోపలే పెరుగుతుంది. అందుకే దీన్ని గుర్తించడం చాలా కష్టం. ఈ కారణంగానే భారతదేశంలో ఇలాంటి భూగర్భ ఫంగస్‌లపై పెద్దగా అధ్యయనాలు జరగలేదు. దీని ఆకారం మామిడి పండును పోలి ఉండటంతో 'ఎర్త్ మ్యాంగో' అని పిలుస్తున్నా, దీనికి మామిడి పండుతో ఎలాంటి సంబంధం లేదని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. చెదపురుగులు ఎక్కువగా ఉండే నేలల్లో ఇది వృద్ధి చెందుతుందని, రుతుపవనాల సమయంలోని తేమ దీని పెరుగుదలకు అనుకూలిస్తుందని భావిస్తున్నారు.స్థానికులు ఈ ఫంగస్‌ను తరతరాలుగా సాంప్రదాయ వైద్యంలో ఉపయోగిస్తున్నారు. దగ్గు, జలుబు, కడుపు నొప్పి, కామెర్లు, చెవి నొప్పి, శరీర నొప్పులు వంటి సమస్యల నివారణకు దీన్ని వాడతారని చెబుతారు. అయితే, ఈ ఔషధ గుణాలకు సంబంధించి పటిష్ఠమైన శాస్త్రీయ ఆధారాలు ఇంకా లభించాల్సి ఉంది. యాంటీబయాటిక్స్ వంటి ఎన్నో మందులు ఫంగస్‌ల నుంచే ఆవిష్కృతమయ్యాయి కాబట్టి, 'నేల మామిడి'లోని జీవ రసాయన సమ్మేళనాలపై పరిశోధనలు జరపాలని నిపుణులు సూచిస్తున్నారు.ఈ ఆవిష్కరణ భారతదేశంలో ఫంగల్ జీవవైవిధ్య పరిరక్షణ ఆవశ్యకతను మరోసారి గుర్తు చేసింది. పక్షులు, జంతువులతో పోలిస్తే ఫంగస్‌లపై చాలా తక్కువ పరిశోధనలు జరిగాయి. వ్యవసాయ పద్ధతుల్లో మార్పులు, రసాయనాల వాడకం, పర్యావరణ విధ్వంసం వల్ల ఎన్నో అరుదైన ఫంగస్ జాతులు శాస్త్రీయంగా గుర్తించకముందే అంతరించిపోతున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని స్థానిక పర్యావరణ జ్ఞానం ఆధునిక శాస్త్రానికి ఎలా మార్గదర్శకంగా నిలుస్తుందో ఈ సంఘటన తెలియజేస్తోంది.

## తెలంగాణ ప్రభుత్వం పలు కులాల పేర్లు మారుస్తూ కీలక నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి -** తెలంగాణలోని వెనుకబడిన తరగతుల (బీసీ) చిరకాల వాంఛను నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలకమైన సామాజిక సంస్కరణకు శ్రీకారం చుట్టింది. బీసీ కమిషన్ సమర్పించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించిన రాష్ట్ర కేబినెట్, జాబితాలోని కొన్ని కులాల పేర్లను మారుస్తూ మరికొన్నింటికి గౌరవప్రదమైన పర్యాయపదాలను జోడిస్తూ ఆమోద ముద్ర వేసింది. ముఖ్యంగా సమాజంలో పిలిచేందుకు అసభ్యకరంగా లేదా కించపరిచే విధంగా ఉన్న పదాలను రికార్డుల నుంచి తొలగించి, ఆయా వర్గాల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా కొత్త పేర్లను ఖరారు చేసింది. ఈ మార్పులు తక్షణమే రాష్ట్ర గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అధికారిక రికార్డుల్లో అమల్లోకి రానున్నాయి.బీసీ గ్రూప్-ఏ విభాగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా వరుస సంఖ్య 7లో ఉన్న 'దొమ్మర' అనే పదాన్ని తొలగించి, దాని స్థానంలో 'గడ వంశీయ' అనే పేరును ఖరారు చేసింది. అలాగే వరుస సంఖ్య 18లో ఉన్న 'పిచ్చకుంట్ల' అనే పదాన్ని మారుస్తూ, ఇకపై వారిని 'వంశ రాజ్'గా వ్యవహరించాలని నిర్ణయించింది. వీటితో పాటు బుడబుక్కల కులానికి 'శివ క్షత్రియ' అనే పదాన్ని, వీరభద్రియ కులానికి వారి కోరిక మేరకు 'వీరముష్టి, నెట్టి కోటల' అనే పదాలను పర్యాయప దాలుగా జోడించింది. వన్నార్ అనే పదాన్ని తొలగించి, దాని స్థానంలో 'ధోబీ' అనే పదాన్ని చేర్చడం ద్వారా రజక, చాకలి వర్గాలకు మరింత స్పష్టమైన గుర్తింపును కల్పించింది.అదేవిధంగా బీసీ గ్రూప్-డి విభాగంలో కూడా ప్రభుత్వం సామాజిక స్పృహతో పలు మార్పులు చేసింది. ముఖ్యంగా ఎప్పటి నుంచో వివాదాస్పదంగా ఉన్న 'శూద్ర కులం' అనే పదాన్ని రికార్డుల నుంచి పూర్తిగా తొలగించి, ఆ స్థానంలో 'తమ్మలి (బ్రాహ్మణేతర)'గా పేరు మార్చింది. దీనివల్ల ఆ వర్గానికి ఒక స్పష్టమైన సామాజిక గుర్తింపు లభిస్తుంది. అలాగే వరుస సంఖ్య 5లో ఉన్న 'మేర', 'చిప్పోలు' కులాలకు 'మేరు' అనే పదాన్ని అదనంగా చేర్చింది. ఈ మార్పుల వల్ల విద్యార్థులు, ఉద్యోగార్థులు తమ కుల ధ్రువీకరణ పత్రాల్లో గౌరవప్రదమైన పేర్లను పొందే అవకాశం ఉంటుంది, ఇది వారి ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంపొందిస్తుందని బీసీ కమిషన్ అభిప్రాయపడింది.

## దేశంలోని గొప్ప పరిశ్రమలన్నీ తీసుకొస్తున్నాం



**మొదటిపేజీ తరువాయి -** చేశారు. కొండగల్ సమస్యల పరిష్కారం కోసం అందరినీ యాచించే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన తనకు ముఖ్యమంత్రి పదవి దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.విద్య, వైద్యం, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పేదలకు ఇస్తున్నామని సీఎం గుర్తు చేశారు. రాష్ట్రంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, కృష్ణా నదీ జలాలతో కొండగల్ భూములు తడవాలని పేర్కొన్నారు. కృష్ణా జలాలు వచ్చే వరకూ మంత్రి దామోదర, శ్రీహరిని నిద్ర పోనీయొద్దని సూచించారు. కొడంగల్‌లో వచ్చిన మార్పులు ప్రజలు గమనించాలని కోరారు. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గణులు ఉన్నాయని, లగచర్లను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని గుర్తు చేశారు. నాడు రాష్ట్రం నలుదిక్కులకు వెళ్లి చదువుకునే వాళ్లమని, నేడు రాష్ట్రం నలుదిక్కుల నుంచి కొడంగల్‌కు వచ్చి చదువుకుంటున్నారని కొనియాడారు.2034 వరకూ కొడంగల్‌లో రాజకీయాలు పక్కనపెట్టి పని చేద్దామని నాయకులకు, ప్రజలకు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశానికే మోడల్‌గా కొడంగల్‌ను తీర్చిదిద్దుతున్నామని, కోస్గీ నుంచి శంషాబాద్‌కు 300 ఫీట్ల రోడ్ వేసుకుంటున్నామని తెలిపారు. దేశంలో గొప్ప పరిశ్రమలు కొడంగల్‌లో పెట్టే ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో పనులు ఏం కావాలో విచారణ చేయాలని, మండలానికి ఒక కమిటీ చొప్పున వేసుకోవాలని సూచించారు. కమిటీలు గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని, పేదల సమస్యలు పరిష్కరించేలా అందరూ కృషి చేయాలని వెల్లడించారు."కొడంగల్ నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నాం. విద్య, వైద్యం, కల్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకాలను పేదలకు ఇస్తున్నాం. రాష్ట్రంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం. కృష్ణా నదీ జలాలతో కొండగల్ భూములు తడవాలి. కృష్ణా జలాలు వచ్చే వరకూ మంత్రి దామోదర, శ్రీహరిని నిద్ర పోనీయొద్దు. కొడంగల్‌లో వచ్చిన మార్పులు ప్రజలు గమనించాలి. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గణులు ఉన్నాయి. లగచర్లను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం. నాడు రాష్ట్రం నలుదిక్కులకు వెళ్లి చదువుకునేవాళ్లం. నేడు రాష్ట్రం నలుదిక్కుల నుంచి కొడంగల్‌కు వచ్చి చదువుకుంటున్నారు. 2034 వరకూ కొడంగల్‌లో రాజకీయాలు పక్కకుపెట్టి పని చేద్దాం. దేశానికే మోడల్‌గా కొడంగల్‌ను తీర్చిదిద్దుతున్నాం.కొడంగల్‌లో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి సీఎం భూమిపూజ చేసిన రేవంత్ రెడ్డి, లగచర్లలో నిర్మించే 430 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దౌల్తాబాద్ వేంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గీలో వేణుగోపాల స్వామి ఆలయం, కొడంగల్ నుంచే దౌల్తాబాద్, కోస్గీ ఆలయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. భూమిపూజలో మంత్రులు దామోదర రాజనరసింహ, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.


## ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయి



**మొదటిపేజీ తరువాయి -** యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసే మత్తుపదార్థాలకు బానిస కావొద్దని కొండా సురేఖ గట్టిగా హెచ్చరించారు. నేటి తరంలో సామాజిక మార్పులు వేగంగా వస్తున్నాయని, యువత నిబద్ధతతో పనిచేస్తూ తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కేవలం ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయని, అడ్డదారులు తొక్కొద్దని ఆమె హితవు పలికారు. ముఖ్యంగా ఉద్యోగ నియామకాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె ఈ సందర్భంగా ఆకాంక్షించారు.నిరుద్యోగ యువతలో ఉండే మానసిక ఒత్తిడిపై ఎంపీ కడియం కావ్య స్పందించారు. యువత ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలని, ప్రతిరోజూ మనలో మనం యుద్ధం చేసుకుంటూ మనల్ని మనం మెరుగుపరుచుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఎన్ని విఫలయత్నాలు ఎదురైనా ఉద్యోగ ప్రయత్నాలను ఆపకూడదని, కష్టపడితేనే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకుంటారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. "మనం తప్పు చేయనంత కాలం ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు" అని మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు నిరుద్యోగుల్లో ధైర్యాన్ని నింపాయి.ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా జరిగిన ఈ మెగా జాబ్ మేళాకు నిరుద్యోగులు భారీగా హాజరయ్యారు. కలెక్టర్ సత్యశారదదేవి, ఎమ్మెల్యే నాగరాజు మరియు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్న ఈ కార్యక్రమం, వరంగల్ ప్రాంత యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో నిర్వహించారు.

## ప్రధాని మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలి సుభాష్ చంద్ర జి

**ఈ నెల 10వ తేదీన నాగారంలోని పరేగ్ గ్రౌండ్స్ లో నిర్వహించనున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ నగరం మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చంద్ర జి పేర్కొన్నారు.**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే. :** సైదాబాద్ లో విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ వికర్షిత్ భారత్ నిర్మాణానికి కంకణ బద్దు లైనా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడవసారి బాధ్యతలు చేపట్టిన తొలిసారి నగరానికి విచ్చేస్తున్నారని తెలిపారు. భాగ్యనగర్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, అన్ని డివిజన్లో కాలనీలు బస్తీలలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రధాని మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతున్నామని తెలిపారు. రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో మూడు మేయర్ స్థానాలను బిజెపి కైవసం చేసుకుంటుందని. అదేవిధంగా తెలంగాణలో బిజెపి జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. భాగ్యనగర్ లో బిజెపి పార్టీ చాలా బలంగా ఉందని తెలిపారు.

## ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకుండా నిరాడంబరమైన మధ్యతరగతి వడ్డెర కుటుంబం నుంచి కేవలం అంకితభావం, సిద్ధాంతం, సమాజానికి సేవ చేయాలనే స్వప్నంతో ఎదిగిన యువ జాతీయోద్యమ నాయకుడు డాక్టర్ లోకేష్ వేముల.



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 8 :** బాల్యం నుంచి అటల్ బిహారీ వాజ్‌పేయి స్ఫూర్తితో విద్యార్థి దశలోనే ఏబీవీపీద్వారా ప్రజా జీవితంలోకి ప్రవేశించి 2013లో అంబర్‌పేట నియోజకవర్గం నుంచి ఎడ్యుకేషనల్ సెల్ కన్వీనర్‌గా భారతీయ జనతా పార్టీలో రాజకీయ యాత్రను ప్రారంభించారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు మరియు స్కాలర్‌షిప్‌ల కోసం పోరాడడం నుండి విద్యార్థుల సంక్షేమం యువకుల హక్కుల కోసం నిలబడటం వరకు, డాక్టర్ లోకేష్ వేముల ఎల్లప్పుడూ సౌకర్యం కంటే సేవా మార్గాన్ని ఎంచుకున్నారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మార్గదర్శకత్వంలో పని చేస్తూ, బిజెపి కార్యక్రమాలు, తెలంగాణ ఉద్యమ నిరసనలు, రైల్ రోకో కార్యక్రమాలు ప్రజా సమస్యల కోసం ప్రజా పోరాటాలలో చురుకుగా పాల్గొన్నారు. వృత్తిపరంగా ఫిజియోథెరపీలో బ్యాచిలర్‌తో అర్హత సాధించినప్పటికీ, అతని హృదయం ఎల్లప్పుడూ సమాజం ప్రజలతో ఉంటుంది. జాతీయ యువజన అధ్యక్షుడిగా, అతను వడ్డెర సమాజ సంక్షేమం ఐక్యత కోసం దక్షిణ భారతదేశం అంతటా పర్యటిస్తూ, విద్యార్థి సహాయ కార్యక్రమాలు, ఆహార పంపిణీ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడు. డాక్టర్ లోకేష్ వేముల ప్రయాణం రాజకీయ వారసత్వం లేదా అధికారంపై నిర్మించబడలేదు. ఇది పోరాటం, త్యాగం, భావజాలం మరియు పేదలు, విద్యార్థులు, యువత మరియు వెనుకబడిన వర్గాలకు సేవ చేయాలనే భావోద్వేగ నిబద్ధతపై నిర్మించబడింది. నిజాయితీ, అంకితభావంతో సమాజానికి సేవ చేయాలని కలలు కనే ప్రతి సామాన్య యువకుడికి ఆయన జీవితం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.

## బహుజన వర్కర్స్ తరపున ఎండిని కలిశారు



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 8 :** బహుజన వర్కర్స్ యూనియన్" తరపున ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ ఆధ్వర్యంలో గౌడ రవి కిరణ్ (వర్కింగ్ ప్రెసిడెంట్), రామచంద్ర(ఉప ప్రధాన కార్యదర్శి), శ్రీనివాస్ (రాష్ట్ర కార్యదర్శి) , సంతోష్ కుమార్ లకావత్, సత్యనారాయణ గౌడ్ లతో కూడిన బృందం ఎండిని కలవడం జరిగింది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, 24-04- 2026 రోజునాడు ప్రకటన చేయాలని ఒకవేళ కాని పక్షంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం రోజైన జూన్ 2 తేదీన అపాయింటెడ్ డేట్ ప్రకటించాలని కోరుతూ వినతిపత్రంతో పాటు కొన్ని విధి విధానాలు రూపొందించి, ఆ నివేదికను బిసి ఎండికి ఇవ్వడం జరిగింది. అలాగే శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రతి ఉద్యోగి నుండి 300/- రూపాయలు మే నెల జీతం లో కటింగ్ చేసి ఆ కుటుంబానికి ఇవ్వాలని లేఖ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎండి బి డబ్ల్యు యు నివేదికను పరిశీలించి ప్రభుత్వంనకు తగు చర్యల నిమిత్తం పంపించి మావంతుగా యాజమాన్య పరంగా విలీనమునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సురేఖ,తిరుపతయ్య,బి శ్రీనివాస్ గౌడ్ , టి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదోడి సొంతింటి కలను నిజం చేస్తున్న ప్రజా ప్రభుత్వం



**మంథని, మే 08(వార్త సంధ్య) :** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎలక్షన్ ముందు ఇచ్చిన హామీ మేరకు మాటకు కట్టుబడి పేదోడి సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం నిజం చేస్తుంది. తెలంగాణ ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు,టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు ప్రత్యేక కృషితో మంథని నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారు. మంథని నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి నిరుపేదలకు సొంతింటి కలను నిజం చేసే కార్యచరణ చేస్తున్నారు. ఆ కార్యక్రమంలో భాగంగా మొదటగా ఇందిరమ్మ మొదటి విడతలో కట్టుకోవడానికి స్థలం ఉండి ఇంటి నిర్మాణాన్ని చేపట్టడానికి స్తోమత లేని కొంతమంది లబ్ధిదారులను గుర్తించి ఇందిరమ్మ సొంత ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంథని మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం రోజున పెండం శారద,సత్యనారాయణ ఇందిరమ్మ లబ్ధిదారు నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి సారేగా నూతన వస్త్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుడిసె గట్టయ్య,మంథని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి,కిసాన్ సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు ముసుకుల సురేందర్ రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముసుకుల ప్రశాంత్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు తోకల మల్లేష్ యాదవ్,కావేటి సందీప్,సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కామెడీ స్టార్ ఫజల్ భాయ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన టైటాస్ జన్మదిన వేడుకలు..




**తిరువూరు,మే08(వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం :** హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ సభ్యుడు సామాజిక కార్యకర్త మాదాసు టైటాస్ పుట్టినరోజు సందర్భంగా కామెడీ స్టార్ ఫజల్ భాయ్ ఆధ్వర్యంలో సమైక్య ప్రెస్ క్లబ్ కార్యాలయం నందు కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేసి పుట్టిన రోజు వేడుకను ఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ మరియు సమైక్య ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మద్దిబోయిన నరేష్, కామెడీ స్టార్ ఫజల్ భాయ్, సుర ఫణి (పెరల్స్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ప్రోగ్రాం అడ్వైజర్), బాలమర్తి సురేష్ ,సింగపోగు రాంబాబు, రాము, యాదాల కావ్య, నాగ శ్రావణి, ఉష, రోజా తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు,రవాణా వాహనాలు అందుబాటులో ఉంచాలి**

**రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ వేగంగా పూర్తి చేసి ట్రక్ షీట్లు వెంటనే జనరేట్ చేయాలి**

**జిల్లాలో పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**





**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 08( వార్త సంధ్య) :** జిల్లాలో జరుగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కల్వశ్రీరాంపూర్ మండలంలోని కూనారం, కల్వశ్రీరాంపూర్ మండల కేంద్రం, ఓదెల మండలంలోని పోత్కపల్లి, ఓదెల మండల కేంద్రం, సుల్తానాబాద్ మండలంలోని రేగడి మధికుంట గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. అలాగే సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామంలోని జై హనుమాన్ రైస్ మిల్, సాంబశివ రైస్ మిల్, పూసాల గ్రామంలోని కనకమహాలక్ష్మి రైస్ మిల్, సుగ్లంపల్లి గ్రామంలోని లక్ష్మీ భవాని రైస్ మిల్లులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు.

నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడింగ్ చేసి ఆలస్యం లేకుండా కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ తెలిపారు. రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి ట్రక్ షీట్లు వెంటనే జనరేట్ చేయాలని సూచించారు.రైస్ మిల్లుల వద్ద రైతులకు ఎలాంటి కోతలు విధించకుండా ధాన్యం స్వీకరించాలని స్పష్టం చేశారు. రైతులకు సంబంధించిన చెల్లింపులు వారి బ్యాంకు ఖాతాల్లో క్రమం తప్పకుండా జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ తనిఖీలలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్ నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోజుకు 14 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని సాధించాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ధాన్యం కొనుగోళ్ల వేగాన్ని వెంటనే పెంచాలి**

**హమాలీల సమస్య పరిష్కరించి లిఫ్టింగ్ వేగవంతం చేయాలి**

**ఈరోజే 100 శాతం ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేయాలి**

**వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలి**

**సమీకృత జిల్లా కలెక్టరేట్లో ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**




**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 08( వార్త సంధ్య) :** జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేసి రోజుకు 14 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లు, లిఫ్టింగ్, ట్యాబ్ ఎంట్రీలు, కొనుగోలు కేంద్రాల పనితీరుపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,జిల్లాలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన సందర్భంగా ప్యాడీ లోడింగ్ పనుల ధాన్యం కొనుగోలు సెంటర్ ఇన్‌చార్జ్‌లు సమర్థవంతంగా పర్యవేక్షించడం లేదని గమనించినట్లు తెలిపారు.



ఇకపై ప్రతి కొనుగోలు కేంద్రంలో కొనుగోలు చేసిన ధాన్యం వేగంగా రైస్ మిల్లులకు చేరేలా సెంటర్ ఇన్‌చార్జ్‌లు ప్రత్యేక బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లాలో ఇంకా 3 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, కొనుగోళ్ల వేగాన్ని తక్షణమే పెంచాల్సిన అవసరం ఉందన్నారు. గత సీజన్‌లో రోజుకు 14 నుండి 15 వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోళ్లు జరిగాయని, ప్రస్తుతం రోజుకు కేవలం 8 వేల మెట్రిక్ టన్నుల మాత్రమే కొనుగోలు జరుగుతోందన్నారు. వెంటనే కొనుగోళ్ల వేగం పెంచి రోజుకు కనీసం 14 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎఫ్ఏక్యూ నిబంధనల ప్రకారం కొనుగోళ్లు ప్రారంభించాలని సూచించారు. ప్రతి కేంద్రంలో హమాలీల సంఖ్యను వెంటనే పెంచాలని, రేపటి నుండి రెట్టింపు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు జరగాలని తెలిపారు. ప్రతి కేంద్రం నుండి రోజువారీగా ఎక్కువ సంఖ్యలో వాహనాల ద్వారా ధాన్యం లిఫ్టింగ్ జరిగేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం లోడింగ్ ప్రక్రియను తప్పనిసరిగా ధాన్యం కొనుగోలు సెంటర్ ఇన్‌చార్జ్‌లు ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం వచ్చే వారం భారీ వర్షాలు ఉండే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు.ట్యాబ్ ఎంట్రీలు ప్రస్తుతం 80 శాతం వరకు మాత్రమే నమోదవుతున్నాయని, ఉదయం ఒక కేంద్రాన్ని సందర్శించినప్పుడు కేవలం 60 శాతం ఎంట్రీలు మాత్రమే నమోదై ఉన్నట్లు గమనించినట్లు తెలిపారు. ఈ పరిస్థితిని వెంటనే సరిచేసి ఈరోజే 100 శాతం ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రెండో శనివారం,ఆదివారం రోజుల్లో కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు తప్పనిసరిగా పని చేయాలని,ధాన్యం కొనుగోళ్లు నిరంతరంగా కొనసాగాలని తెలిపారు. కొనుగోళ్ల సమయంలో తప్పనిసరిగా ఎఫ్ఏక్యూ నిబంధనలు పాటించాలని సూచించారు.జిల్లాలో 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయ్యే వరకు స్థానిక రైతుల ధాన్యానికే రైస్ మిల్లుల్లో ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడులు కూడా అధికంగా రావడంతో హమాలీల కొరత తలెత్తే అవకాశం ఉందని, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా హమాలీలను సమీకరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీసీవో శ్రీమాల,డీసీఎస్ఓ శ్రీనాథ్, అడిషనల్ డీఆర్‌డీవో రవీందర్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, రైస్ మిల్ నిర్వాహకులు,లారీ అసోసియేషన్ అధ్యక్షులు,తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్ బహిరంగసభలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 8 :** కొడంగల్‌లో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల కు కూడా పేదల తిరుపతి గా పేరుగాంచింది.. 2009 లో మొదటి సారి నేను మొదటి సారి కొడంగల్ ఎమ్మెల్యేగా గెలవడానికి ఎంతో మంది కార్యకర్తలు తమ చెమటను రక్తంగా మార్చి పనిచేశారు.. కొడంగల్ శాసనసభ నియోజకవర్గం అంటే ఒకవైపు గుడి ..మరో వైపు గడి గుడి ,గడి ఏకమై కొడంగల్ ను ఒక నందనవనంగా పాడి పంటలతో విలసిల్లేలా ముందుకు తీసుకెళ్లేందుకు కలిసివచ్చారు.. మాజీ ఎమ్మెల్యే నందారం సూర్యనారాయణ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి టీటీడీ నుంచి నిధులు తెచ్చి అభివృద్ధి చేశారు.. ఆగమశాస్త్ర సలహాదారులు సుందరవరదాచార్యులు పెట్టిన ముహూర్తం ప్రకారమే శంకుస్థాపన చేశాం.. వారు ఈ సమయంలో లేకపోవడం దురదృష్టకరం.. సుందరవరదాచార్యుల వారిని ఈ ప్రాంత ప్రజలు శాశ్వతంగా గుర్తు పెట్టుకునేలా పేరు ఒక విడిదికి పెట్టమని సూచిస్తున్న. తిరుపతిలో ఏ సాంప్రదాయం ప్రకారం పూజలు చేస్తారో అవే పూజలు కొడంగల్ దేవాలయంలో చేయాలి..

### ఇది గొప్ప దైవ కార్యక్రమం..

కొడంగల్ పేరు ప్రతిష్టలను దేశ స్థాయిలో నిలబెట్టడానికి ఇది ఉపయోగపడుతుంది.. మాజీ శాసనసభ్యులు గుర్నాథరెడ్డి ఎన్నో సార్లు గెలిచినా మంత్రి కాలేకపోయారు..కొడంగల్ అభివృద్ధి కోసం ఎన్నో విజప్తులు చేసినా ఆనాడు ప్రయోజనం లేకపోయింది..2018 లో కొడంగల్ లో నేను ఓడిపోయిన తర్వాత మల్కాజ్ గిరి ఎంపీగా నిలబడినప్పుడు ఇక్కడి నుంచి అనేక మంది కార్యకర్తలు వచ్చి కష్టపడి గెలిపించారు..ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణ ముఖ్యమంత్రిగా నిలబడ్డాను.. అందరి సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నాం..

### రోజూ కు 18 గంటలు కష్టపడి పనిచేస్తున్నాం..

రైతు రుణమాఫీ, సన్న బియ్యం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఫీజు రీఎంబర్స్ మెంట్ఇ లా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నాం.. పేదల విద్య, వైద్యం కోసం ఎన్నో







కార్యక్రమాలు చేస్తున్నాం.. ఒకప్పుడు కొడంగల్ లో విద్య కోసం పక్కన ఉన్న వికారాబాద్ , పరిగి వెళ్లేవారు.. కొడంగల్ నుంచి అనేక మంది వలసలు పోయారు.. కొడంగల్ రాష్ట్రంలోనే ఎత్తైన ప్రాంతం.. నీళ్లు వచ్చే అవకాశం లేకపోయింది..

### వడ్లు పండించే పరిస్థితి లేదు..

కందులు తప్ప ఏమీ పండలేదు.. ఇందిరమ్మ ఇళ్లు కూడా కట్టుకోలేని అమాయకత్వం కొడంగల్ ప్రజలది.. ఈ రోజు ప్రతి తండా కు, గ్రామపంచాయతీకి రోడ్డు నిర్మించుకున్నాం.. కార్యకర్తలు, నాయకుల కష్టంతోనే నేను ఈ స్థాయికి వచ్చాను.. నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ఏడాదిన్నర లోపు పూర్తి చేసి కృష్ణా నది జలాలు తీసుకురావాలి.. కొడంగల్ భూములు కృష్ణా జలాలతో తడవాలి.. నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ బాధ్యత మంత్రి శ్రీహరికి అప్పగిస్తే నెలలోపే పూర్తి చేశారు.. ఎత్తిపోతల పథకానికి ఈ నాడు ఏ అడ్డంకులు లేవు.. ఎప్పుడంటే అప్పుడు నిధులు మంజూరు చేస్తాం..వికారాబాద్ రైల్వే లైన్ తొంభై శాతం పూర్తైంది.. సిమెంట్ పరిశ్రమ వచ్చే ఆరు నెలల్లో నిర్మాణం జరుగుతుంది.. స్థానికంగా ఉద్యోగ, ఉపాది అవకాశాలు మెరుగు అవుతాయి మెడికల్, ఇంజనీరింగ్, ఎటీసీ సెంటర్ , నర్సింగ్ కాలేజ్, పాలిటెక్నిక్, సైనిక్ స్కూల్ ఇలా అన్ని విద్యా సంస్థలు కొడంగల్ లో ఏర్పాటు అవుతున్నాయి.. యేడాదిన్నర లో ఎడ్యుకేషన్ హబ్ పనులు పూర్తి అవుతాయి.. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు చదువు కోసం కొడంగల్ కు వచ్చేలా చేస్తున్నాం.. కొడంగల్ కార్యకర్తల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి పదవి వచ్చింది.. దేశానికి ఆదర్శంగా కొడంగల్ ను తీర్చిదిద్దుకోవాలి.. 2300 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ను లగచర్ల దగ్గర ఏర్పాటు చేసుకుంటున్నాం.. ఎయిర్ పోర్టు నుంచి కొడంగల్ కు పెద్ద రోడ్డు నిర్మిస్తున్నాం..రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా పనిచేయాలి.. చిన్న చిన్న సమస్యలను పక్కన పెట్టాలి.. దౌల్తాబాద్ లో వెంకటేశ్వర స్వామి , కోస్గిలో వేణుగోపాల స్వామి దేవాలయం నిర్మించుకుంటున్నాం.. దేశంలోని గొప్ప పరిశ్రమలు కొడంగల్ కు వస్తున్నాయి.. 2009 లో మీరు నాటిన మొక్క ఇప్పుడు చెట్టుగా మారింది.. చెట్టు ను మీరు కాపాడుకోవాలి.. 2027 డిసెంబర్ లోగా కొడంగల్ లోని అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సిందే.. సర్పంచ్ లు ఏ పార్టీ నుంచి గెలిచినా గ్రామాల్లో మాత్రం పనులు చేసుకోవాలి.. కొడంగల్ ను బంగారు తునక గా చేసుకుందాం.


## మూసీ నివాసితులకు డిప్యూటీ సీఎం భరోసా

**ప్రజా భవన్‌లో మధుపార్క్ రిడ్జ్ అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రుల భేటీ**

**మూసీ నది పునర్జీవనానికి సహకరించండి**

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 8 :** మూసీ పునర్జీవన ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులయ్యే వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా తగిన సాయం అందిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం ప్రజా భవన్‌లో మూసీ పునర్జీవన క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,





మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులను మధుపార్క్ రిడ్జ్ (బి-బ్లాక్) రెసిడెన్షియల్ అసోసియేషన్ నాయకులు కలిశారు. ఈ



సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు తమ వినతులను మంత్రులకు సమర్పించారు. నివాసితులు వ్యక్తం చేసిన సందేహాలు, అపోహలను మంత్రులు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మధుపార్క్ రిడ్జ్ బి-బ్లాక్ నివాసితులందరి విషయంలో ప్రభుత్వం అత్యంత సానుకూల దృక్పథంతో ఉందన్నారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, వారికి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నగరవాసులకు స్వచ్ఛమైన గాలి, నీరు, పచ్చదనం అందించేందుకు చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని వారిని డిప్యూటీ సీఎం కోరారు. ప్రభుత్వ హామీ పట్ల అసోసియేషన్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. మూసీ పునర్జీవనానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మధుపార్క్ రిడ్జ్ అసోసియేషన్ అధ్యక్షులు దొడ్డ శ్రీనివాస్ రెడ్డి, సెక్రటరీ జి.వి. శేఖర్, సభ్యులు సత్యనారాయణ, గౌతమ్ రాయ్, రేణుధల్, నబీ సాహెబ్, సాహిల్ ఖాన్ పాల్గొన్నారు. ప్రభుత్వ పక్షాన మూసీ ప్రాజెక్ట్ ఎండి ఈ.వి. నర్సింహారెడ్డి, జాయింట్ ఎండి గౌతమి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి తదితరులు హాజరయ్యారు.

## సచివాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 8 :** హాజరైన మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ప్రెసిడెంట్ ఫహీముద్దీన్ ఖురేషి, హజ్ కమిటీ చైర్మన్ గులామ్ అఫ్జల్ బియాబని, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఉర్దూ అకాడమీ ప్రెసిడెంట్ తాహెర్ బిల్ హమద్, చైర్మన్ దీపక్ జాన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు.

## ఐటీఐ ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం

**ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ బుసిరెడ్డి వెంకట్ రెడ్డి**

**మే 14 నుండి జూన్ 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ**

**10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు**




**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 08(వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ , ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ సంస్థలు (ఐటీఐలు), ఏటీసీలలో 2026-27 విద్యా సంవత్సర ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్, కన్వీనర్ బుసిరెడ్డి వెంకట్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ ఎస్ఎస్‌సీ మెమో, బోనాఫైడ్,కుల ధ్రువీకరణ పత్రం,ఆధార్, టీసీ తదితర ధ్రువపత్రాలను స్కాన్ చేసి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు మే 14, 2026 నుండి జూన్ 8, 2026 వరకు ి××ంవశ్రీఖఅస్త్రుఱఖ వెబ్‌సైట్‌ రి ద్వారా రూ.100 వెరిఫికేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 2026 ఆగస్టు 1 నాటికి 14 సంవత్సరాల వయస్సు పూర్తి చేసిన అభ్యర్థులు ప్రవేశాలకు అర్హులని,అభ్యర్థులు తమ సొంత మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీని ఉపయోగించాలని, దరఖాస్తు సమయంలో ఉపయోగించిన మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీని ఐటీఐ పూర్తి అయ్యే వరకు మార్చరాదని సూచించారు. మార్చిన పక్షంలో అడ్మిషన్ రద్దయ్యే అవకాశం ఉందని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసిన ప్రతి అభ్యర్థి తమకు నచ్చిన ట్రేడ్లలో ఎక్కువ సంఖ్యలో ఐటీఐలను ఆప్షన్లుగా ఎంపిక చేసుకునే అవకాశం ఉందని, జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## చెరువులలో కలుపు నివారణ, చేపల ఉత్పత్తి పెంపుపై అవగాహన సదస్సు

**జిల్లా మత్స్య శాఖాధికారి పి. నరేష్ కుమార్ నాయుడు**

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 08(వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లాలో "99 రోజుల ప్రజా పాలన - ప్రగతి రైతు వారోత్సవాలలో భాగంగా మత్స్య శాఖ ఆధ్వర్యంలో మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో 'చెరువులలో కలుపు నివారణ, వ్యాధుల నియంత్రణ , చేపల ఉత్పత్తి పెంపు' అనే అంశంపై ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి పి. నరేష్ కుమార్ నాయుడు మాట్లాడుతూ జిల్లాలోని మత్స్య సహకార సంఘాల సభ్యులకు చెరువుల్లో గుర్రపుడెక్క వంటి కలుపు మొక్కల నివారణ, చేపలకు సోకే వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించారు. ఆధునిక పద్ధతులను పాటించడం ద్వారా చేపల దిగుబడిని ఏ విధంగా పెంచుకోవచ్చో వివరించారు.వివిధ గ్రామాల నుండి సుమారు 250 మంది మత్స్యకార సంఘాల సభ్యులు హాజరయ్యారు. మత్స్యకారులు ప్రభుత్వం అందిస్తున్న ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని అధికారులు మత్స్యకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మత్స్య కళాశాల (పెబ్బేరు) జ్ఞానేశ్వర్, ఉపాధ్యాయులు, అధికారులు జిల్లా మత్స్య సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు,తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ మంత్రిని కలిసిన డీజీపీ సివి ఆనంద్





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి(వార్త సంధ్య) మే 8 :** రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని తెలంగాణ రాష్ట్ర డిజిపీ సి.వి. ఆనంద్ శుక్రవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మంత్రి కూడా శాలువా కప్పి సి.వి. ఆనంద్ ని అభినందించారు. పోలీసింగ్‌లో రాష్ట్రం ఉన్నత శిఖరాలను చేరుకునేలా కృషి చేయాలని మంత్రి శ్రీనివాసరెడ్డి అభిలషించారు.

## హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ లో కొడంగల్ కు బయలుదేరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 8 :** సీఎంతో పాటు కొడంగల్ కు బయలుదేరిన మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి. కొడంగల్ లో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం 430 పడకల ఆసుపత్రి నిర్మాణం, దౌల్తాబాద్ వెంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరుకానున్న సీఎం.

## ఇందిరా మహిళా శక్తి భవన పనులను పరిశీలించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి, మే 8 (వార్త సంధ్య ప్రతినిధి):** తెలంగాణ ప్రభుత్వం రూ.5 కోట్ల వ్యయంతో మంజూరు చేసిన జిల్లా ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతి, నాణ్యతా ప్రమాణాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి 2026 మే 25వ తేదీలోగా భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు ఇందిరా మహిళా శక్తి భవనం కీలక వేదికగా మారాలని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని సూచించారు. నిర్దేశించిన గడువులోగా అన్ని మౌలిక సదుపాయాలతో భవనాన్ని పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ, ఉత్పత్తుల ప్రదర్శన, మార్కెటింగ్ కార్యకలాపాలకు అనుకూలంగా భవనాన్ని తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ఈ కేంద్రం ఉపయోగపడేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీఆర్డీఓ సురేందర్, డీపీఆర్ఈ దుర్గాప్రసాద్, పీఆర్ డీఈఈ స్వామి దాస్, డీపీఆర్ఓ తిరుమల తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## క్లిష్టమైన శస్త్ర చికిత్సలకు నిలయంగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి





**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 08(వార్త సంధ్య) :** మడిపల్లి గ్రామం జమ్మికుంట పట్టణానికి చెందిన ఒక 18 సంవత్సరాల ఒక యువతికి తన 4 సంవత్సరాల వయస్సులో ఎడమ మోకాలి పైన చిన్నగా ఎముక పెరగడం జరిగింది. దీనికి ఆ వయసులో శస్త్ర చికిత్స సాధ్యంకాదు కావున ఆ యువతికి 18 సంవత్సరాల వయస్సులో శస్త్ర చికిత్స నిర్వహించాలి అని అప్పటి వైద్యులు చెప్పడం జరిగింది. తదుపరి ఆ అమ్మాయికి 18 సంవత్సరాలు వచ్చాక ప్రైవేట్ హాస్పిటల్ లో చూపిస్తే ఆ శస్త్ర చికిత్సకు చాలా ఖర్చుతో కూడుకున్నది అని చెప్పడం జరిగింది. కానీ వారు వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్సలు అవుతున్నాయి అని తెలిసి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ ని కలవడం జరిగింది. వారు వెంటనే స్పందించి ఎముకల వైద్య నిపుణులు అయిన డా. కుమార్ గౌడ్ తో అన్ని రకాల పరీక్షలు నిర్వహించి,శుక్రవారం ఆ యువతికి చాలా క్లిష్టమైన శస్త్ర చికిత్స చేసి బోన్ ట్యూమార్ ను తొలగించడం జరిగింది. ఈ శస్త్ర చికిత్సలో పాల్గొన్న వైద్యులు సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డా. కుమార్ గౌడ్ మరియు డా. వినయ్, వీరి తో పాటు మత్తు వైద్యురాలు డా. స్వాతి, సదరు శస్త్ర చికిత్స చేసిన వైద్యులు మరియు ఓటి సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు . అదేవిధంగా ప్రజలందరూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న నవజాత శిశు కేంద్రం సేవలు, 2 డి ఎకో సేవలు, ఆధునిక పరిజ్ఞానంతో కూడిన లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలు, యూరాలజీ సేవలు మరియు రూట్ కెనాల్ సేవలను ఉపయోగించుకోవాలని, మరియు ఈ సేవలలో ఏవైనా ఇబ్బందులు ఎదురైనచో నేరుగా సూపరింటెండెంట్ ని కలవచ్చు అని,ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందికి సూపరింటెండెంట్ చేయు విజ్ఞప్తి ఏమనగా వారికి సంబంధించిన పేషెంట్ హాస్పిటల్ లో ఉన్న సమయంలో సానిటేషన్ గురించి గాని, వాష్ రూమ్ శుభ్రత గురించి గాని ఎవరైనా డబ్బులు అడిగినా గాని మరియు ఏ ఇతర సమస్య ఉన్నా కూడా నర్సింగ్ సూపరింటెండెంట్ ని,ఆర్ఎంఒ ని,నేరుగా సూపరింటెండెంట్ ని సంప్రదిశీచగలరు లేని యెడల ఫిర్యాదులను కంప్లైంట్ బాక్స్ లో ఇవ్వవచ్చు, వారి సమస్యని వెంటనే పరిష్కారం చేయడానికి ప్రయత్నం చేస్తాం అని సూపరింటెండెంట్ తెలియచేయడమైనది మరియు ప్రభుత్వ ఆసుపత్రి లో అన్ని రకముల సేవలు ఉచితం ఎవ్వరికి లంచం ఇవ్వరాదు అని తెలియచేసారు.

# నీటి కోసం ఆదివాసీల శ్రమదానం..!

**గుంతల రోడ్డును బాగుచేసి ట్యాంకర్‌కు దారి కల్పించిన గ్రామస్తులు**

**మంచినీటి కోసం అధికారుల ఎదుట చేతులెత్తిన చిరతానిపాడు ఆదివాసీలు**

**బోర్ పెట్టి బాధ్యత మరిచిన పాలకులు.. వేసవికొచ్చేసరికి మళ్లీ నీటి కష్టాలే**

**మహిళలు, యువకులే కార్మికులై రహదారి మరమ్మతులు**

**మౌలిక సదుపాయాలు లేక ఆదివాసీ గ్రామాలపై ప్రభుత్వాల నిర్లక్ష్యం బహిర్గతం**

**చిరతానిపాడు గ్రామం కష్టాల పై వార్త సంధ్య ప్రత్యేక కథనం**





**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 08 (వార్త సంధ్య) :** పాల్వంచ మండలం చిరతానిపాడు గ్రామంలో ఆదివాసీ ప్రజలు తాగునీటి కోసం పడుతున్న కష్టాలు ప్రభుత్వాల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. ప్రతి వేసవిలో మంచినీటి సమస్యతో అల్లాడుతున్న గ్రామ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అధికారులు, పాలకులు మాత్రం హామీలకే పరిమితమవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం గ్రామంలో ఏర్పాటు చేసిన చేతి బోర్ అరగంటపాటు మాత్రమే నీరు ఇస్తుండటంతో గ్రామస్తులు మళ్లీ నీటి కోసం అవస్థలు పడుతున్నారు. వేసవి ప్రారంభమైనప్పటి నుంచే మహిళలు బిందెలతో తిరుగుతూ నీటి కోసం పడుతున్న ఇబ్బందులు గ్రామంలో దయనీయ పరిస్థితిని తలపిస్తున్నాయి. ఇదిలా ఉండగా పంచాయతీ ద్వారా ట్రాక్టర్ ట్యాంకర్‌తో నీరు సరఫరా చేయాలనుకున్నా, గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి ట్యాంకర్ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం చేయాల్సిన పనిని గ్రామస్తులే భుజాన వేసుకుని శ్రమదానంతో రోడ్డును బాగుచేయడం గమనార్హం. మహిళలు, యువకులు, వృద్ధులు కలిసి మట్టి మోసి గుంతలను పూడ్చి ట్యాంకర్‌కు దారి కల్పించారు. "తాగునీటి కోసం కూడా ప్రజలే రోడ్లు వేసుకోవాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరం కాదా..?" అంటూ గ్రామస్తులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. కోట్ల రూపాయలు అభివృద్ధి పేరుతో ఖర్చు చేస్తున్నామని చెప్పే పాలకులు, కనీసం ఆదివాసీ గ్రామాలకు తాగునీరు, రహదారి వంటి ప్రాథమిక సదుపాయాలు కల్పించలేకపోవడం బాధాకరమని అంటున్నారు. చిరతానిపాడు వంటి దూర ప్రాంత గ్రామాల్లో అధికారులు ఎప్పుడూ పర్యటించకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే శాశ్వత తాగునీటి సదుపాయం కల్పించడం, కొత్త బోర్లు ఏర్పాటు చేయడం, గ్రామ రహదారిని పూర్తిగా అభివృద్ధి చేయడం వంటి చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## లింగాపూర్‌లో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహణ

**ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 8 (వార్తా సంధ్య ):** పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం లింగాపూర్ గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో మొత్తం 20 గేదెలకు గర్భకోశ వ్యాధి చికిత్సలు అందించగా, 16 పశువులకు సాధారణ వైద్య సేవలు అందించారు. అదనంగా 23 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. కాఫ్ ర్యాలీ నిర్వహించి 35 మంది రైతులకు పశు సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాడి రైతుల ఆర్థికాభివృద్ధిలో పశుసంపద కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. పశువులకు సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా పాల ఉత్పత్తి పెరిగి రైతులకు లాభాలు చేకూరుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పశు వైద్య సేవలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దూడల సంరక్షణ, పశుగ్రాసాల సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. పశువుల ఆరోగ్య పరిరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పశువైద్యాధికారి డా. రవికిరణ్ రైతులకు పశుపోషణ, దూడల సంరక్షణ, పశుగ్రాసాల పెంపకం అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్యాధికారి డా. భరత్, కౌన్సిలర్ కాసర్ల రాణి, విజయ్ డైరీ అధ్యక్షుడు బండారి నరేందర్ రెడ్డి, కార్యదర్శి మంచాల రాజు, సంజీవ్ రెడ్డి, పాడి రైతులు, పశు వైద్య సిబ్బంది బి. ప్రవీణ్ గౌడ్, గోపాలమిత్రులు ఎన్. శ్రీనివాస్, బాబాగౌడ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పద్మావతి బేకరీలో రెవెన్యూ అధికారుల తనిఖీలు...

**పట్టుబడ్డ అక్రమ సబ్సిడీ గ్యాస్..**

**సబ్సిడీ గ్యాస్ ను బ్లాక్ లో బేకరీలకు,హోటల్లకు విక్రయిస్తున్న గ్యాస్ ఏజెన్సీ...**




**మంథని, మే 08(వార్త సంధ్య) :** మంథని పట్టణంలోని పద్మావతి బేకరి లో అక్రమంగా సబ్సిడీ గ్యాస్ ఉపయోగిస్తున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా స్పందించిన రెవెన్యూ అధికారులు శుక్రవారం పద్మావతి బేకరిలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అక్రమంగా వినియోగిస్తున్న అక్రమ సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ను పట్టుకున్నారు. సామాన్య ప్రజలు గ్యాస్ కోసం నెలల తరబడి ఎదురు చూస్తున్నా గాని అందని సబ్సిడీ గ్యాస్ ఏజెన్సీ ద్వారా అక్రమంగా బేకరీ లకు,హోటళ్లకు చేరుతుంది. హోటల్లు,బేకరీ యజమానులు బ్లాకులో గ్యాస్ సిలిండర్లను మూడు వేల వరకు చెల్లిస్తూ అక్రమంగా కొంటున్నారు. ఎక్కువ డబ్బులు చెల్లించి గ్యాస్ ను కొన్న హోటల్,బేకరీ యజమానులు ఆ భారాన్ని సామాన్య ప్రజలపై మోపుతున్నారు. కావున సామాన్య ప్రజల పై భారం పడకుండా సబ్సిడీ గ్యాస్ ను సరైన సమయంలో ప్రజలకు అందించాలని. సబ్సిడీ గ్యాస్ లను బ్లాక్ లో అధిక ధరలకు అమ్ముతున్న గ్యాస్ ఏజెన్సీ పైన సంబంధిత అధికారులు సరైన చర్యలు తీసుకొని తిరిగి గ్యాస్ ను బ్లాక్ లో బేకరీలకు, హోటళ్లకు విక్రయించకుండా సరైన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేస్తున్నాము అన్నారు.

## ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు ప్రజా సమస్యల కొరకై వాటర్ వర్క్స్ & సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి ని కలిసిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్ ప్రతినిధి, మే 8 (వార్త సంధ్య):** ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వాటర్ వర్క్స్ & సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి నియోజక వర్గ పరిధిలోని పలు ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ సందర్భం గా చంపాపేట్ డివిజన్ కర్మన్‌ఘాట్ పరిధిలోని క్రాంతినగర్ కాలనీలో బోర్‌వెల్ విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరణ చేయాలని కోరారు. కాలనీలో సుమారు 300 కుటుంబాలు నివసిస్తు న్నాయని, వీరిలో అధిక సంఖ్యలో పేద మరియు మధ్యతరగతి కుటుంబాలే ఉన్నాయని తెలిపారు. తీవ్ర తాగునీటి సమస్య కారణంగా ప్రజలు బోర్‌వెల్‌లపై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. గతంలో బోర్‌వెల్‌కు సంబంధించిన విద్యుత్ బిల్లులను జీహెచ్ఎంసీ చెల్లించగా, అనంతరం వాటర్ వర్క్స్ వారు తమ ఆధీనంలోకి తీసుకున్న తర్వాత బిల్లులు చెల్లించకపోవడంతో ప్రస్తుతం రూ.6,38,641/- బకాయిని కాలనీవాసులే చెల్లించాలని విద్యుత్ శాఖ నోటీసులు జారీ చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని బోర్‌వెల్ విద్యుత్ కనెక్షన్‌ను తక్షణమే పునరుద్ధరించి బకాయి బిల్లులను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వచ్చే బిల్లులను అసోసియేషన్ వారే కట్టుకునే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. అదేవిధంగా బి.యన్.రెడ్డి నగర్ సాగర్ కాంప్లెక్స్ పరిసరాల్లో ట్రంక్ లైన్ పనుల అంశాన్ని కూడా ఎం.డి. దృష్టికి తీసుకెళ్లారు. సాగర్ కాంప్లెక్స్ నుంచి వచ్చే డ్రైనేజీ నీరు సరైన అవుట్‌లెట్ లేక గుర్రంగూడ ఫారెస్ట్ మరియు హరిహారపురం కాలనీలోకి చేరుతూ ఫారెస్ట్ ప్రాంతంలోని రెండు చెరువులు మురికికూపాలుగా మారిపోయాయని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా నూతన ట్రంక్ లైన్ మంజూరు చేయాలని కోరారు. అలాగే ప్రస్తుతం సరూర్‌నగర్ చెరువు పరిధిలో 2.5 మీటర్ల సామర్థ్యం మాత్రమే ఉన్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని దానిని 9 లేదా 10 మీటర్ల వరకు పెంచాలని సుధీర్ రెడ్డి కోరారు. దీనివల్ల చెరువులో కలుషిత నీరు తగ్గడంతో పాటు దుర్వాసన సమస్య తగ్గి, నీటి నాణ్యత మెరుగుపడి పరిసర కాలనీల ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.అలాగే నియోజకవర్గంలోని డ్రైనేజీ సమస్యలు కూడా పరిష్కారం చేయాలనీ కోరారు. శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం ఎండి మాట్లాడుతూ తప్పకుండా సుధీర్ రెడ్డి చెప్పిన అంశాలను పరిగణనలో తీసుకొని సంబంధించిన అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ బారాస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద రెడ్డి,చంపాపేట్ డివిజన్ యువ నాయకులు గండికోట శ్రీనాథ్ పలువురు కాలనీవాసులు ఆనంద్,దివాకర్,సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

# వాటర్ వర్క్స్ & సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి తో చర్చించిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి,మే 08:** ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వాటర్ వర్క్స్ & సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా చంపాపేట్ డివిజన్ (కర్మన్ఘాట్) పరిధిలోని క్రాంతినగర్ కాలనీలో బోర్‌వెల్ విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరణ చేయాలని కోరారు. కాలనీలో సుమారు 300 కుటుంబాలు నివసిస్తున్నాయని, వీరిలో అధిక సంఖ్యలో పేద మరియు మధ్యతరగతి కుటుంబాలే ఉన్నాయని తెలిపారు. తీవ్ర తాగునీటి సమస్య కారణంగా ప్రజలు బోర్‌వెల్‌లపై ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. గతంలో బోర్‌వెల్‌కు సంబంధించిన విద్యుత్ బిల్లులను జీహెచ్ఎంసీ చెల్లించగా, అనంతరం వాటర్ వర్క్స్ వారు తమ ఆధీనంలోకి తీసుకున్న తర్వాత బిల్లులు చెల్లించకపోవడంతో ప్రస్తుతం రూ.6,38,641/- బకాయిని కాలనీవాసులే చెల్లించాలని విద్యుత్ శాఖ నోటీసులు జారీ చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు.



ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని బోర్‌వెల్ విద్యుత్ కనెక్షన్‌ను తక్షణమే పునరుద్ధరించి బకాయి బిల్లులను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం వచ్చే బిల్లులను అసోసియేషన్ వారే కట్టుకునే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. అదేవిధంగా బి.యన్.రెడ్డి నగర్ సాగర్ కాంప్లెక్స్ పరిసరాల్లో ట్రంక్ లైన్ పనుల అంశాన్ని కూడా ఎం.డి. దృష్టికి తీసుకెళ్లారు. సాగర్ కాంప్లెక్స్ నుంచి వచ్చే డ్రైనేజీ నీరు సరైన అవుట్‌లెట్ లేక గుర్రంగూడ ఫారెస్ట్ మరియు హరిహారపురం కాలనీలోకి చేరుతూ ఫారెస్ట్ ప్రాంతంలోని రెండు చెరువులు మురికికూపాలుగా మారిపోయాయని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా నూతన ట్రంక్ లైన్ మంజూరు చేయాలని కోరారు. అలాగే ప్రస్తుతం సరూర్‌నగర్ చెరువు పరిధిలో 2.5 ఎమ్.ఎల్.డి సామర్థ్యం మాత్రమే ఉన్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని దానిని 9 లేదా 10 ఎమ్.ఎల్.డి వరకు పెంచాలని సుధీర్ రెడ్డి కోరారు. దీనివల్ల చెరువులో కలుషిత నీరు తగ్గడంతో పాటు దుర్వాసన సమస్య తగ్గి, నీటి నాణ్యత మెరుగుపడి పరిసర కాలనీల ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.అలాగే నియోజకవర్గంలోని డ్రైనేజీ సమస్యలు కూడా పరిష్కారం చేయాలనీ కోరారు. శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం ఎండి మాట్లాడుతూ తప్పకుండా సుధీర్ రెడ్డి చెప్పిన అంశాలను పరిగణనలో తీసుకొని సంబంధించిన అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ బారాస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద రెడ్డి,చంపాపేట్ డివిజన్ యువ నాయకులు గండికోట శ్రీనాథ్ పలువురు కాలనీవాసులు ఆనంద్,దివాకర్,సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లతో పేదల్లో వెలుగులు

### కన్నాలలో ఇందిరమ్మ గృహ ప్రవేశంలో మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి



**మంథని,మే08 ( వార్త సంధ్య ) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో పేద కుటుంబాలలో ఆనందం కనబడుతోందని మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మంథని మండలంలోని కన్నాలలో పెండం శారద, సత్యనారాయణ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహ ప్రవేశంలో మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముసుకుల సురేందర్ రెడ్డితో కలిసి ఇందిరమ్మ గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సయేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి సొంతగృహం ఉండాలని లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రక్రియ వేగవంతం చేసిందన్నారు. మంత్రి శ్రీధర్ బాబు నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. పేద ప్రజలను ఆదుకునే ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ముసుకుల ప్రశాంత్ రెడ్డి, నాయకులు తోకల మల్లేష్, కావేటి సందీప్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌లో మధ్య లాజిస్టిక్ పార్కులు

**యువతకు జాబ్ గ్యారెంటీ!**

**వస్తు నిల్వ, రవాణాకు కీలకంగా తెలంగాణ**

**ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్‌ల మధ్య లాజిస్టిక్స్ కారిడార్**

**గ్రామీణ, పట్టణ ప్రాంతాల అనుసంధానం**

**తెలంగాణ లాజిస్టిక్స్ పాలసీ 2.0 ప్రధాన లక్ష్యాలు**



దేశంలో వస్తువుల నిల్వ, రవాణాకు కేంద్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని నిలపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'లాజిస్టిక్స్ పాలసీ 2.0' పేరుతో నూతన పాలసీని త్వరలో తీసుకురానుంది. ఒక వస్తువు తయారు అయిన చోటు నుంచి కస్టమర్‌కు చేరేంతవరకు ప్రతి దశను కలిపి 'లాజిస్టిక్స్' అని వ్యవహరిస్తుంటారు. దక్షిణాదిలో సముద్ర తీరం లేని రాష్ట్రం అయినప్పటికీ ఆ ప్రతికూలతను అధిగమిస్తూ లాజిస్టిక్స్ రంగంలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలపాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ విజన్-2047లో భాగంగా ప్రతిపాదించిన ప్యూర్(పెరి-అర్బన్ రీజియన్ ఎకానమీ) జోన్ తెలంగాణ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చనుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం బలంగా విశ్వసిస్తోంది.ఔటర్ రింగ్ రోడ్(ఓఆర్ఆర్), రీజినల్ రింగ్ రోడ్(ఆర్ఆర్ఆర్)ల మధ్య ఉన్న ప్రాంతాన్ని లాజిస్టిక్స్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తే గ్రామాల్లో సాగయ్యే పంటల దిగుబడులు, తయారయ్యే వస్తువులు అతి త్వరగా నగరాలకు, ఎగుమతి కేంద్రాలకు చేరవేసేందుకు వీలుపడుతుంది. పారిశ్రామిక క్లస్టర్లు నేరుగా మార్కెట్లు, ఓడరేవులతో కనెక్ట్ అవుతాయని అప్పుడు అన్నదాతలు, చిన్న తరహా పరిశ్రమలకు పెద్దఎత్తున ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో పాటు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 10-12 కొత్త లాజిస్టిక్స్ పార్కులు, వేర్ హౌసింగ్ జోన్లను నెలకొల్పాలని సర్కారు నిర్ణయించింది. తద్వారా యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తుందని విశ్వసిస్తోంది. ఈ పాలసీలో మహిళల భాగస్వామ్యం పెంచేందుకు ప్రత్యేక స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ శిబిరాల నిర్వహణకు ప్రణాళికలను రూపొందించింది. హైదరాబాద్ మహానగరం దక్షిణ, మధ్య భారతదేశానికి ముఖ్య పంపిణీ కేంద్రంగా, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, ఈ-కామర్స్ రంగాలకు గమ్యస్థానంగా మారింది. మంగళపల్లి, బాటసింగారం వద్ద ఏర్పాటు చేసి ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్కులను విజయవంతంగా నడుస్తున్నాయి. గ్రేడ్-ఏ వేర్‌హౌసింగ్‌కు డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌లో లాజిస్టిక్స్ రంగాన్ని స్ట్రాటజిక్ గ్రోత్ ఇంజిన్‌గా గుర్తించారు. అందులో భాగంగా రీజినల్ రింగ్ రోడ్(ఆర్ఆర్ఆర్) సమీపంలో ఒక భారీ డ్రై పోర్ట్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీన్ని 297 కిలోమీటర్ల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, రైల్వే లైన్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని ఓడరేవులతో అనుసంధానం చేయనున్నారు. ఫలితంగా తెలంగాణ ఎగుమతి సామర్థ్యం మరింత పెరుగుతున్నట్లుగా తెలుస్తోంది. ఇక మనోహరాబాద్‌లో ప్రతిపాదించిన మెగా మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్క్ దేశ రవాణా నెట్‌వర్క్‌లో తెలంగాణ రాష్ట్ర స్థానాన్ని బలోపేతం చేస్తుందని ప్రభుత్వం బలంగా నమ్ముతోంది. 2047 నాటికి స్థూల దేశీయోత్పత్తి(జీడీపీలో) తెలంగాణ వాటాను 5% నుంచి 10%కి పెంచడంలో ఈ లాజిస్టిక్స్ పాలసీ ఒక 'గేమ్ ఛేంజర్' కానుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది. భారత్‌లో లాజిస్టిక్స్ ఖర్చులు స్థూల దేశీయోత్పత్తిలో దాదాపు 13-14%గా ఉన్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది 8-9% మాత్రమే ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన పాలసీ ద్వారా రాష్ట్రంలో ఈ రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గించనున్నాయి. లాజిస్టిక్స్ పాలసీ 2.0లో మల్టీమోడల్ కనెక్టివిటీ, గ్రీన్ లాజిస్టిక్స్, డిజిటలైజేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ మొదలైన వాటితో కూడిన విధానాన్ని తీసుకొస్తున్నారు. ఈ విధానం రవాణా ఖర్చును తగ్గించి, వేగాన్ని పెంచుతుంది. రాష్ట్రంలోని ఫార్మా, తయారీ రంగం, ఎలక్ట్రానిక్స్ కంపెనీలకు అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీని ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుంది.నూతన పాలసీ ప్రకారం ప్రతి జిల్లాలోనూ కోల్డ్ స్టోరేజీలను, కామన్ ఫెసిలిటీ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. దీనివల్ల జిల్లా స్థాయి ఉత్పత్తులు నేరుగా అంతర్జాతీయ ఎగుమతులకు సిద్ధమయ్యేందుకు అవకాశం ఏర్పడుతుంది. స్టాంపు డ్యూటీ మినహాయింపులు, సబ్సిడీలు ఈ ఎంఎస్ఎంఈలక అదనపు ఊతమిస్తాయి. తెలంగాణ ప్రభుత్వం 'నెట్ జీరో' లక్ష్యంతో ముందుకు వెళుతోంది. ఎలక్ట్రిక్ వాహనాల వాడకం, గ్రీన్ వేర్‌హౌసింగ్, సోలార్ ఎనర్జీతో నడిచే లాజిస్టిక్స్ పార్కులను ప్రోత్సహించడం ద్వారా సుస్థిర అభివృద్ధిని సాధించవచ్చని ప్రభుత్వం యోచిస్తోంది.

## గుంజపడుగు వాసికి మానవ హక్కుల కమిషన్ లో చోటు

### - మానవ హక్కుల రాష్ట్ర లైఫ్ బోర్డ్ మెంబర్ గా రేండ్ల సతీష్ నియామకం



**మంథని,మే08 ( వార్త సంధ్య) :** మంథని మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన న్యాయవాది రేండ్ల సతీష్ కు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ లో జీవితకాల సభ్యత్వం లభించింది. అందరితో కలుపుకోలుగా ఉంటూ ఉచితంగా న్యాయాసలహాలు అందించే సతీష్ నియామకం పట్ల ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ మానవ హక్కుల స్వచ్ఛంద సంస్థ ( ఎన్ ఎచ్ ఆర్ ఎ సి సి ఐ ఫౌండేషన్) లో గుంజపడుగు వాసి మంథని న్యాయవాది రీండ్ల సతీష్ స్టేట్ బోర్డు లైఫ్ టైమ్ మెంబర్ గా నియామకం :- భారత కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల మరియు కరెంట్ అఫ్ఫైర్స్ గుర్తింపు పొందిన జాతీయ మానవ హక్కుల స్వచ్ఛంద సంస్థ (ఎన్ ఎచ్ ఆర్ ఎ సి సి ఐ ఫౌండేషన్ ) యందు సామాజిక బాధ్యతలు, సీనియర్ సిటిజన్ తల్లి తండ్రులకు న్యాయ సహకారాలు అందించినందుకు గాను పెద్దపల్లి జిల్లా మంథని మండలం గుంజపడుగు గ్రామ నివాసి రేండ్ల సతీష్ ని స్టేట్ బోర్డు లైఫ్ టైమ్ మెంబర్ గా నియామకం చేసినట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ డైరెక్టర్ అతున్ దాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకానికి సహకరించిన నేషనల్ హ్యూమన్ రైట్స్ నేషనల్ బోర్డు మెంబర్ కటకం శ్రీ హర్ష కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ కన్న తల్లి తండ్రులకు అన్యాయం జరిగిన వాళ్లకు న్యాయం చేయడానికి ఈ నియామకం ఉపయోగపడుతుందని రేండ్ల సతీష్ తెలిపారు.

## పొన్నం ప్రభాకర్ గౌడ్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన ఎల్బీ నగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 08:** తెలంగాణా రాష్ట్ర రవాణా & బిసి సంక్షేమ శాఖా మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ జన్మదినం సందర్భంగా పిసిసి మాజీ కార్యదర్శి మరియు ఎల్.బి.నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ , ఎల్.బి.నగర్ యువనాయకులు ముద్దగౌని మనీష్ గౌడ్,బంజారా హిల్స్ లోని మినిస్టర్ క్వార్టర్స్ నందు మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ ని కలిసి శాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# హాస్టల్ ఓనర్స్‌కు సీపీ సుమతి స్ట్రాంగ్ వార్నింగ్

**ఇకపై మిడ్‌నైట్ విద్యార్థులు రోడ్లపై తిరిగితే దబిడి దిబిడే**

**దిల్‌సుఖ్‌నగర్ హాస్టళ్ల ఓనర్స్‌తో మల్కాజిగిరి సీపీ సుమతి కోఆర్డినేషన్ మీటింగ్**

**హాస్టల్స్‌పై సెక్యూరిటీ ఆడిట్ చేశామన్న సీపీ సుమతి**

**విద్యార్థుల కదలికపై నిరంతరం నిఘా ఉంచుతామని వెల్లడి**



యువతను మత్తు రక్కసి కోరల నుంచి కాపాడేందుకు పోలీస్ యంత్రాంగం సరికొత్త వ్యూహాలకు పదును పెట్టిందని మల్కాజిగిరి సీపీ సుమతి తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని హాస్టళ్ల నిర్వాహకులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. సరూర్ నగర్ పరిధిలోని హాస్టళ్లలో ఇప్పటికే ప్రత్యేక సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించినట్లు సీపీ సుమతి పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారే హాస్టళ్లను సీజ్ చేయడానికి సైతం వెనుకాడబోమన్నారు. విద్యార్థుల కదలికలపై నిరంతర నిఘా ఉంటుందని, నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని సుమతి స్పష్టం చేశారు. మత్తు పదార్థాల విక్రయాలకు కేంద్రాలుగా మారుతున్న పాన్ షాపులపై ప్రత్యేక నిఘా ఉంచామని సీపీ సుమతి పేర్కొన్నారు. నగర భద్రతలో సామాన్య పౌరులు, పాదచారులు సైతం భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.సరూర్ నగర్ ప్రాంతంలో దాదాపు 30వేల మంది యువత ఉంటున్నారని సీపీ సుమతి తెలిపారు. వారిలో ఏపీ, తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన వారు ఇక్కడ హాస్టళ్లు, తాత్కాలిక వసతి గృహాల్లో ఉంటున్నారన్నారు. అయితే దీన్ని ఆసరాగా తీసుకుని కొంతమంది అసాంఘిక శక్తులు కొన్ని గ్రూపులను ఏర్పాటు చేసి డ్రగ్స్, ఇతర దురలవాట్ల బారిన పడటానికి కారణమవుతున్నారని వివరించారు. దానివల్ల యువత కెరీర్ నాశనమవుతుందన్నారు. రాత్రి ఒంటి గంట తర్వాత పదేపదే బయట తిరిగే వారిపై దృష్టిసారించామని చెప్పారు. అలాంటి వారిని గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇస్తామని పేర్కొన్నారు. నేరరహితంగా చేసేందుకే ఇక్కడ సెక్యూరిటీ ఆడిట్‌ను నిర్వహించినట్లు వెల్లడించారు. అందులో భాగంగానే ఇక్కడ 3200 కెమెరాలు పనిచేస్తున్నట్లుగా తెలిసిందన్నారు.హాస్టళ్లలో ఉంటున్న ప్రతి యువకుడికి సంబంధించిన డేటాబేస్ పోలీసుల వద్ద ఉండే విధంగా సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించామని సుమతి తెలిపారు. కొంతమంది బిజినెస్ ముసుగులో డ్రగ్స్ అమ్ముతున్నారని అలాంటి ప్రాంతాలపై నిఘా ఉంచుతామని సీపీ వివరించారు. సమయానికి మించి బయట యువత బయటతిరుగున్న హాస్టళ్ల యాజమాన్యాలపై దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. జీహెచ్ఎంసీ ఫైర్, ఎక్సైజ్, అన్ని కలిసి నేరరహిత ప్రాంతంగా చేసేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. అవసరమైతే కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు. నేరస్తులను టెక్నాలజీ ద్వారా గుర్తించే విధానాన్ని తీసుకువస్తున్నామన్నారు."630 హాస్టళ్లలో సెక్యూరిటీ ఆడిట్ పూర్తయ్యింది. వసతి గృహంలో ఎంతమంది ఉంటున్నారు, ఏజ్ గ్రూపు, ఏం చేస్తున్నారు తదితర వివరాలు సేకరించడం జరిగింది. ఈ డేటాతో సాంకేతికతను ఉపయోగించి నిర్ణీత సమయం తర్వాత యువత ఎన్నిసార్లు బయట తిరుగుతున్నారనేది గుర్తిస్తాం. రీపీటెడ్‌గా బయట తిరిగేవారికి పోలీసులు కౌన్సిలింగ్ ఇస్తారు రాత్రివేళ బయట తిరిగే వారిలో ఎక్కువగా 15 నుంచి 18 ఏళ్లు, మధ్య వయస్కులు ఉంటున్నారు. ఎల్‌బీనగర్ జోన్‌లో 4, ఉప్పల్ జోన్‌లో 5 ప్రాంతాలు, ఇలాంటి నిబంధనలు పెట్టబోతున్నాం. 630 హాస్టళ్లలో ఉంటున్న 30 వేల మంది డేటా పోలీసుల వద్ద ఉంది.కమిషనరేట్ ఏరియాలో సరూర్ నగర్ ప్రాంతం ప్రముఖమైనదని సీపీ సుమతి తెలిపారు. సెక్యూరిటీ పరంగా కూడా హై ప్రోఫైల్ ఏరియా అని తెలిపారు. ఇక్కడ వేలమంది యువత పలు పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు ఏపీ, తెలంగాణ నుంచి వచ్చినవారు ఉన్నారని వివరించారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఈ ప్రాంతం రద్దీగా ఉంటుందని వివరించారు. క్రైమ్ రేట్లు పెరిగే అవకాశం ఉందనే ఉద్దేశంతోనే సెక్యూరిటీ ఆడిట్ చేశామన్నారు. యువత నేరాలబాట పట్టకుండా ఉండేందుకు సరూర్ నగర్ పోలీసు, ఎల్‌బీనగర్ సంయక్తంగా దీనిని నిర్వహించామన్నారు.

## నూతనంగా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వికాస్ మోహంతో కి శుభాకాంక్షలు తెలియజేసిన వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి




**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి,మే 08:** నూతనంగా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన వికాస్ మోహంతో ని వనస్థలిపురం డివిజన్ మాజీ తాజా కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్ మరియు బి.యన్.రెడ్డి గణేష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.అలాగే జోనల్ కమిషనర్ కి మా డివిజన్లో కొన్ని పెండింగ్ ఉన్న వర్క్స్ అన్నిటిని తొందరగా పూర్తిచేయాలని జోనల్ కమిషనర్ ని కోరారు.అదేవిధంగా జోనల్ కమిషనర్ అతి త్వరలోనే మీ సమస్యలను పెండింగ్ లో ఉన్న వర్క్స్ అన్నింటిని పూర్తి చేపిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ కాలనీ హరేందర్ రెడ్డి మరియు వాసు పాల్గొన్నారు.

# తెలంగాణ బీడీ కార్మికులకు గుడ్ న్యూస్.. పెరిగిన వేతనాలు



తెలంగాణలోని లక్షలాది మంది బీడీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. బీడీ పరిశ్రమ యాజమాన్యాలు, కార్మిక సంఘాల మధ్య జరిగిన చర్చలు ఫలించడంతో కార్మికుల వేతనాలు పెరిగాయి. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఈ మేరకు కొత్త వేతన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం 2028 ఏప్రిల్ 30 వరకు అమల్లో ఉంటుంది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 7 లక్షల మంది కార్మికులు లబ్ధి పొందనున్నారు.తాజా ఒప్పందం ప్రకారం వెయ్యి బీడీలు చుడితే కార్మికులకు ఇచ్చే వేతనాన్ని రూ.6 మేర పెంచేందుకు యాజమాన్యాలు అంగీకరించాయి. ప్రస్తుతం వెయ్యి బీడీలకు రూ.268.31 చెల్లిస్తుండగా, పెంపు తర్వాత అది రూ.275.23కు చేరనుంది. జాతీయ సెలవులు, బోనస్ వంటివి కలుపుకొంటే వెయ్యి బీడీలపై మొత్తం రూ.6.92 (15.33%) పెరుగుదల ఉంటుందని కార్మిక సంఘాలు తెలిపాయి.తెలంగాణలో బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వారిలో 98 శాతం మంది మహిళలే కావడం గమనార్హం. ప్రధానంగా నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, సిద్దిపేట, మెదక్, జనగాం జిల్లాల్లో ఈ పరిశ్రమ విస్తరించి ఉంది. నిజామాబాద్‌ను బీడీ పరిశ్రమకు కేంద్రంగా పరిగణిస్తారు. ప్రతి రెండేళ్లకోసారి కార్మిక సంఘాలు యాజమాన్యాలతో చర్చలు జరిపి వేతన ఒప్పందాలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది.బీడీలు చుట్టే కార్మికులతో పాటు పరిశ్రమలో పనిచేసే ఇతర సిబ్బందికి కూడా ఈ ఒప్పందంలో లబ్ధి చేకూరింది. దాదాపు 12,000 నుంచి 14,000 మంది ఉండే ప్యాకర్లు, బట్టీవాలాలు, మునిమ్‌లు, ఇతర క్లర్క్‌ల జీతాలను కూడా పెంచారు. బీడీ ప్యాకింగ్ కార్మికులకు నెలకు రూ.4,500, మిగిలిన ఉద్యోగులకు నెలకు రూ.2,200 చొప్పున వేతనం పెరగనుంది. ఈసారి కేవలం రూ.3 మేర మాత్రమే పెంపు ఉంటుందని మొదట భావించినప్పటికీ, చర్చల్లో యాజమాన్యాలను ఒప్పించి రూ.6 పెంపు సాధించామని కార్మిక సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు.

# వైరస్‌లు క్యాన్సర్ కారకాలు



శరీరంలో ఏదైనా భాగంలో కణాల పెరుగుదల అదుపులేకుండా పెరిగి ఇతర భాగాలకు వ్యాపించడాన్ని క్యాన్సర్‌గా పేర్కొంటారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది ప్రజల అనారోగ్యానికి, మరణాలకు క్యాన్సర్ ప్రధాన కారణంగా ఉంటున్నది. ఇప్పుడు ఇతర కారకాలతోపాటు వైరస్‌లు కూడా కొన్ని రకాల క్యాన్సర్లను కలగజేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నట్లు ఆరోగ్య రంగ నిపుణులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వైరస్‌లు క్యాన్సర్‌ను ఎలా కలగజేస్తాయి, వాటిని నిరోధించడానికి ఎలాంటి వ్యూహాలను అనుసరించాలో అవగాహన ఉండాలి. ఇన్ఫెక్షన్లకు కారణమయ్యే అతి సూక్ష్మ అంటురోగాల కారకాలే వైరస్‌లు. ఇవి బయటి వాతావరణంలో నిర్జీవులుగా ఉంటాయి. ఒకసారి జీవిలో ప్రవేశించాయంటే ఆ జీవి కణాల్లో అభివృద్ధి చెందుతూ జీవ లక్షణాలను ప్రదర్శిస్తాయి. అయితే, కొన్ని రకాల వైరస్‌లు అవి ఆశ్రయించిన (హోస్ట్) జీవి కణాల పనితీరులో కలిసిపోయేలా మార్పుచెందుతాయి. దీనివల్ల కణాల సాధారణ విధుల్లో అవాంతరాలు ఏర్పడతాయి. ఇలాంటి వాటిలో 'ఆంకోజెనిక్' లేదా 'ట్యూమర్ వైరస్‌లు'గా పిలిచే అనేక వైరస్‌లు మనుషుల శరీరంలో క్యాన్సర్ అభివృద్ధికి కారణంగా ఉంటాయి. వీటిలో హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ), హెపటైటిస్ బి, హెపటైటిస్ సి వైరస్‌లు (హెచ్‌బీవీ, హెచ్‌సీవీ), లాలాజలం, ఇతర శరీర ఫ్లూయిడ్ల ద్వారా వ్యాపించే 'ఎప్‌స్టీన్ బార్ వైరస్' (ఈబీవీ), హ్యూమన్ ఇమ్యునో డెఫీషియెన్సీ వైరస్ (హెచ్‌ఐవీ) లాంటివి ప్రసిద్ధి చెందిన క్యాన్సర్ కారక (ఆంకోజెనిక్) వైరస్‌లుగా ఉన్నాయి. ఈ వైరస్‌లు క్యాన్సర్‌కు దారితీసే మార్గాలు వేర్వేరుగా ఉంటాయి. కాకపోతే అవి వ్యాపించే విధానం మాత్రం దాదాపుగా ఒకేలా ఉంటుంది. ఉదాహరణకు, హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) ఆంకోప్రొటీన్లను ఉత్పత్తి చేస్తుంది. ఇది కణం పనితీరు సాఫీగా సాగిపోయే ప్రక్రియకు అంతరాయం కలిగిస్తుంది. నియంత్రణ లేకుండా కణాలు పెరిగిపోయే క్రమాన్ని ప్రోత్సహిస్తుంది. చివరికి ప్రాణాంతకమైన క్యాన్సర్ అభివృద్ధి చెందడానికి దారితీస్తుంది. అదేవిధంగా, హెపటైటిస్ బి, సి వైరస్‌లు కూడా దీర్ఘకాలిక ఇన్ఫెక్షన్లు, ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమవుతాయి. హెపటో సెల్యులర్ కార్సినోమా అనే క్యాన్సర్ అభివృద్ధి చెందే ముప్పును పెంచుతాయి. రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్న వ్యక్తులలో, హెచ్‌ఐవీ సోకిన వారిలో వైరస్ సంబంధిత క్యాన్సర్లు అభివృద్ధి చెందే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

### రోగాల భారం...

ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో క్యాన్సర్ ముప్పు వైరల్ ఇన్ఫెక్షన్లతో ముడిపడి ఉంటుందనే విషయాన్ని గమనించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) అంచనాల ప్రకారం సంవత్సరానికి ఇరవై లక్షలకుపైగా క్యాన్సర్ కేసులు క్యాన్సర్ కారక వైరస్‌లతో (ఆంకోజెనిక్ వైరస్‌లు) సంబంధం కలిగి ఉన్నాయి. దాదాపు 90 శాతం గర్భాశయ క్యాన్సర్లకు హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ), కాలేయ క్యాన్సర్లలో ఎక్కువ భాగం హెపటైటిస్ బి (హెచ్‌బీవీ), హెపటైటిస్ సి (హెచ్‌సీవీ)లు కారణం అవుతున్నాయి. అయితే, వైరస్ ఇన్ఫెక్షన్లు, వాటి కారణంగా క్యాన్సర్లు రాకుండా నివారించడంలో ప్రభుత్వాలు చేపట్టే ప్రజా ఆరోగ్య కార్యక్రమాలే కీలకపాత్ర పోషిస్తాయి.

### నివారణకు బహుళ నమూనా...

వైరస్‌ల వల్ల అభివృద్ధి చెందే క్యాన్సర్లను నిరోధించడానికి ఆయా రకాల వైరస్‌ల వ్యాప్తిని తగ్గించడం, టీకాలు వేయడం, ముందుగానే స్క్రీనింగ్ పరీక్షలు చేయడం, ఇన్ఫెక్షన్లకు తగిన చికిత్స అందించడం వంటి బహుళ నమూనా (మల్టీ మోడల్) విధానాన్ని అనుసరించాల్సి ఉంటుంది.

### టీకాలు (వ్యాక్సినేషన్)...

క్యాన్సర్ నివారణలో టీకాలు ప్రభావవంతంగా పనిచేస్తాయని రుజువైంది. మహిళల్లో ఎక్కువగా కనిపించే గర్భాశయ క్యాన్సర్‌పై పోరాటానికి హెచ్‌పీవీ టీకా సమర్థంగా పనిచేస్తుంది. అదేవిధంగా, హెపటైటిస్ బి వైరస్‌తో వ్యాపించే కాలేయ క్యాన్సర్ ప్రాబల్యాన్ని తగ్గించడంలో హెపటైటిస్ బి టీకాలు ప్రభావవంతమైన పరిష్కారంగా చెప్పొచ్చు. ప్రజారోగ్య ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా చిన్న వయసులోనే అవసరమైన టీకాలు వేయించుకోవడం, అధిక టీకా రేట్లు నమోదు కావడానికి ప్రభుత్వాలు కృషిచేయాలి.

### స్క్రీనింగ్, ముందస్తు గుర్తింపు...

గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్‌లు పాప్ స్మియర్ టెస్ట్, హెచ్‌పీవీ పరీక్షలు చేయించుకోవడం వంటివి వైరస్‌లతో వచ్చే క్యాన్సర్లను ముందుగా గుర్తించేందుకు ఉపకరిస్తాయి. ముఖ్యంగా ముప్పు ఎక్కువగా ఉన్న వారి విషయంలో క్యాన్సర్ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించడానికి స్క్రీనింగ్ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి. చికిత్సను సులభతరం చేస్తాయి.


### యాంటీవైరల్ థెరపీ...

హెపటైటిస్ బి వైరస్, హెపటైటిస్ సి వైరస్ వంటి దీర్ఘకాలిక వైరల్ ఇన్ఫెక్షన్లకు యాంటీవైరల్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. వీటితో వైరస్ స్థాయిలను సమర్థంగా తగ్గించుకోవచ్చు. ఆ విధంగా క్యాన్సర్ అభివృద్ధి చెందే ముప్పును కూడా తగ్గించవచ్చు. హెపటైటిస్ సి చికిత్సలో ప్రత్యక్షంగా పనిచేసే డైరెక్ట్ యాక్టింగ్ యాంటీవైరల్ ఏజెంట్ల పురోగతి పూర్తి వైరస్ నిర్మూలనకు, క్యాన్సర్ తగ్గడానికి అవకాశం ఇస్తుంది.

### ప్రజా ఆరోగ్య కార్యక్రమాలు...

వైరస్‌లు, కాన్సర్ల మధ్య ఉన్న సంబంధాన్ని ప్రజలకు తెలియజేయడంలో అవగాహన కార్యక్రమాలు కీలకపాత్ర పోషిస్తాయి. అంటువ్యాధులు ఎలా వ్యాప్తి చెందుతాయి, టీకాల ప్రాముఖ్యం, వ్యాధుల బారినపడటాన్ని తగ్గించడానికి సురక్షిత చర్యలు తీసుకోవడం వంటివి ఈ వ్యాధుల ప్రభావాన్ని బాగా తగ్గిస్తాయి. వ్యాధి నిరోధకత పెంపు రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఇన్ఫెక్షన్లు సులభంగా సోకుతాయి. కాబట్టి ఇమ్యూనిటీ బలహీనంగా ఉన్నవాళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ముఖ్యంగా హెచ్‌ఐవీ, ఇతర వైరల్ ఇన్ఫెక్షన్ల నుంచి బలహీనమైన రోగ నిరోధక వ్యవస్థ ఉన్న సమూహాలు ఎదుర్కొనే ముప్పును తగ్గించడానికి తగిన టీకా కార్యక్రమాలు, స్క్రీనింగ్ చర్యలు దోహదపడతాయి. వైరస్‌లు సాధారణ జలుబు మొదలుకుని క్యాన్సర్ల వ్యాప్తి వరకు ఎన్నో ఆరోగ్య సమస్యలకు కారకాలుగా ఉంటాయి. ఈ సవాలును సమర్థంగా ఎదుర్కోవడానికి వివిధ రంగాల నుంచి సమష్టి కృషి అవసరమవుతుంది. వైరస్ ప్రేరిత, వైరస్ సంబంధిత క్యాన్సర్లను నివారించడంలో టీకాలు, స్క్రీనింగ్, యాంటీవైరల్ థెరపీలు కీలకమైన అంశాలు. ఈ రక్షణ చర్యలపై ప్రభుత్వాలు, ఆరోగ్య రంగ సంస్థలు దృష్టి సారించడం ద్వారా వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల వచ్చే క్యాన్సర్ ముప్పును గణనీయంగా తగ్గించవచ్చు. ప్రాణాలను నిలబెట్టుకోవచ్చు. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య పరిస్థితులను కూడా మెరుగుపర్చుకోవచ్చు. అయితే, వైరస్‌లు, క్యాన్సర్ల మధ్య పరస్పర చర్యలపై అంతర్జాతీయంగా పరిశోధనలు కొనసాగుతున్నాయి. కాబట్టి, క్యాన్సర్లను నివారించే దిశగా ఔషధాలు, చికిత్సలు అభివృద్ధి చేసే దిశగా నిరంతర అధ్యయనం, కొత్త కొత్త ఆవిష్కరణలు చేయాల్సిన అవసరం ఎంతో ఉంది.

# కాళన్న స్ఫూర్తి ఎక్కడ?



'పాలనాధికారం దుర్వినియోగం చేసే/ గుండాలకు నేను ద్రోహినే/ అన్యాయాన్నెదిరించడం/ నా జన్మహక్కు నా విధి' అన్న కాళోజీని గుర్తుచేసుకోవాల్సిన సందర్భం ఇది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వారసత్వాన్ని చాటే నిర్మాణాలు చేపట్టారు. జిల్లాలకూ, ప్రాజెక్టులకు ఇంకా మరెన్నింటికో తెలంగాణ కీర్తి పతాకలు, స్ఫూర్తి ప్రతీకలుగా నిలిచిన మహానుభావుల పేర్లు పెట్టారు. కుమ్రంభీం, జయశంకర్‌సార్, కాళోజీ వంటి తెలంగాణ పోరాట పటిమకు, తెగువకు మారుపేరైన మహోన్నతుల పేర్లను నిత్య స్మరణీయాలుగా మార్చి నిజమైన నివాళి ఘటించారు. ఆ కోవలో రూపుదిద్దుకున్నదే వరంగల్‌లోని కాళో జీ కళాక్షేత్రం. ఏకశిలా నగరానికి సిగలో పువ్వులా సువిశాలమైన ప్రాంగణంలో మహా సభావేదిక నిర్మాణానికి కేసీఆర్ ప్రణాళికలు వేశారు. ఆ ప్రాంగణంలోనే కాళన్న నిలువెత్తు విగ్రహం చేయించారు. ప్రారంభోత్సవమే తరువాయి అన్న తరుణంలో సర్కారు మారింది. దాదాపుగా పూర్తయిన భవనానికి రంగులు, సున్నాలు వేసి అట్టహాసాలు చేస్తున్నది రేవంత్ ప్రభుత్వం. ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండానే ఇదివరక టి సర్కార్ పూర్తిచేసిన రిక్రూట్‌మెంట్‌తో నియామక పత్రాల పంపిణీ పేరిట హంగామా చేసి పేరు కొట్టేయాలని చూసినవాళ్ల నుంచి ఇంతకంటే ఏం ఆశించగలం? ఇంతకూ కాళోజీ పేరుతో ప్రచారం పొందాలని చూస్తున్న కాంగ్రెస్ పాలకుల్లో ఆయన స్ఫూర్తి కించిత్తు అయినా ఉన్నదా అనేది అసలు ప్రశ్న. ఏడాది కావస్తున్నా ఒక్కటంటే ఒక్కటి ప్రజానుకూల నిర్ణయం తీసుకున్నారా? ఒక్క మంచిపనికి శ్రీకారం చుట్టారా? అంతదాకా ఎందుకు, ఏ అస్తిత్వం కోసం కాళోజీ లాంటి మహానుభావులు కొట్లాడారో దానినైనా కాపాడుతున్నారా? తెలంగా ణ పొడే గిట్టని పరాయి పాలకుల ముందు మోకరిల్లుతున్నారు. నీటి హక్కులను కాటగలుపుతున్నారు. ఇదంతా చాలదన్నట్టుగా ఆనవాళ్లు చెరిపేస్తామని ఎగిరెగిరి పడుతున్నారు. కాళోజీ కళాక్షేత్రం కేసీఆర్ ఆనవాళ్లలో ఒకటి కాదా? ఆ మాటకు వస్తే తెలంగాణే కేసీఆర్ అతిపెద్ద ఆనవాలుగా చరిత్రలో నిలిచిపోయింది. చెరిపేస్తే చెరిగిపోవడానికి అది నీటిమీద రాతకాదు, సువర్ణాక్షరం. ఈర్ష్యాద్వేషాలతో రగిలిపోయే చేతగాని, అనుభవం లేని పాలకు లు రాష్ట్రాన్ని ఆగమాగం చేస్తున్నరు. ప్రజాపాలన అంటూ ప్రజాకంట క పాలన తెచ్చారు. ప్రశ్నిస్తే కేసులు అరెస్టులంటూ వేధిస్తూ పోలీసు రాజ్యం చెలాయిస్తున్నారు. కాళోజీ బ్రతికి ఉంటే ఇవన్నీ సహించేవా రా? 'దోపిడీ చేసే ప్రాంతేతరులను దూరం దాకా తన్ని తరుముతం.. ప్రాంతం వాడే దోపిడీ చేస్తే ప్రాణంతోనే పాతర పెడతం' అని గర్జించాడు కదా. అంతేకాదు, తన పేరిట నిర్మించిన ప్రాంగణంలోనే పోలీ సు జులుం ప్రదర్శిస్తే ఊరుకునేవారా? 'హింస పాపమని యెంచు దేశమున హిట్లరత్వమింకెన్నాళ్లు?' అని ప్రశ్నించిన కాళోజీ నేడు రాష్ట్రాన్నే జైలుగా మార్చి ఎమర్జెన్సీ తరహా పాలన తెస్తే పోనీలే అని సరిపెట్టుకునేవారా? 'మరిచిపోకుండగ గురుతుంచుకోవాలె.. కాలంబు రాగానె కాటేసి తీరాలె' అని కాళన్న చెప్పింది ఈ తరహా పాలకుల గురించే అన్నది గుర్తుంచుకోవాలి.

# నిజం చెప్పకుంటే అబద్ధమే రాజ్యమేలుతుంది



పోరాటాల గడ్డ మన వరంగల్ ఖిల్లా. తెలంగాణ ఉద్యమ నాదాన్ని శిరస్సుపై మోసి భారతదేశానికి ప్రత్యేక రాష్ట్ర వాంఛను పరిచయం చేసింది మన వరంగల్ జిల్లానే. కాకతీయ రాజులు, సమ్మక్క-సారక్కలు అందించిన వారసత్వంతో%ొా% దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, కాళోజీ నారాయణరావు, ప్రొఫెసర్ జయశంకర్ సార్ పౌరుషత్వంతో పిడికిలి బిగించి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకురావడంలో ప్రధాన భూమిక పోషించిన వరంగల్ జిల్లా ప్రజానీకానికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. నిన్న వరంగల్ జిల్లాకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మెప్పు పొందేందుకు గాను వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరించిన వరంగల్ ఎంపీ కడియం కావ్య వ్యాఖ్యలకు మనందరం సమాధానం చెప్పకపోతే అన్యాయమే రాజ్యమేలుతుంది. నిజాలను, అబద్ధాలుగా మలచాలని చూసినా, అబద్ధాలను నిజాలుగా చేయాలనే ప్రయత్నం చేసినా చరిత్ర ఒప్పుకోదు గాక ఒప్పుకోదు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వైద్య రంగానికి సరితూగేలా వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెడికల్ కాలేజీలు నిర్మించడమే కాకుండా వరంగల్ నడిబొడ్డున కార్పొరేట్‌ను తలదన్నేలా 24 అంతస్థులతో బహుళ ప్రజా దవాఖాన నిర్మాణం చేపట్టిన ఘనత బీఆర్ఎస్‌ది. శతాబ్ద కాలంలో జరగని అభివృద్ధిని, బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ద కాలంలోనే చేసి చూపెట్టి మాది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని నిరూపించింది. మీ తండ్రి అయిన కడియం శ్రీహరి నాటి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా చేసిన వ్యాఖ్యలను ఒకసారి గుర్తుచేసుకో. ప్రజాకవి కాళోజీ నారాయణరావు ధిక్కార స్వర నినాదంతోటే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని చెప్పడం లో ఎలాంటి సందేహం లేదు. ప్రజల ఐక్యతతో అందిపుచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం మరింత ప్రజ్వరిల్లాలని మన వరంగల్ ప్రత్యేక భూమిక పోషించింది. అందులో భాగంగానే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రణాళికలతో త్రినగరాన్ని సుందరీకరించుకున్నాం. ఎన్నో అంతర్జాతీయ పరిశ్రమలను వరంగల్ జిల్లాకు తీసుకువచ్చి, వరంగల్ ఖ్యాతిని ఖండాంతరాలకు పరిచయం చేసిన నేత కేసీఆర్. కానీ, కొందరు మిడిమిడి జ్ఞానంతో వాస్తవాలను, అవాస్తవాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, చరిత్ర చెరిగిపోదు కదా? కాకతీయ రాజుల చరిత్రను తిరగరాసేలా.. ముందు తరాలకు భవిష్యత్తు రహదారిని పరిచేందుకు గాను కేసీఆర్ 'మిషన్ కాకతీయ' పేరుతో ప్రతి నీటి బిందువును ఒడిసిపట్టి రేగుముళ్లతో ఉన్న పొలాలను పచ్చని మాగాణిగా మలిచారు. నాడు ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాకవి కాళోజీ నారాయణరావు ను అణచివేయాలని, రాజకీయంగా ఎదగనీయకుండా చేయాలని శతవిధాలుగా ప్రయత్నించిన విషయం తెలిసిందే. అయితే ఆ పార్టీ నేడు నీతులు మాట్లాడుతుండటం నీచమైన రాజకీయ చర్యగా భావిస్తున్నా. కాళోజీ నామస్మరణ చేసే హక్కు కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం లేదు. నాడు వ్యతిరేకించిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు భజనలు చేయడం చూస్తుంటే 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అన్నట్టుగా ఉన్నది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం కాళో జీ నారాయణరావుకు ప్రత్యేక గుర్తింపు ఉండాలని నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ నేతృత్వంలోని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగ ల్ జిల్లా ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఆ సమావేశంలో కాళోజీ కళాక్షేత్ర నిర్మాణానికి పూనుకోవాలని తీర్మానం చేశారు. అనుకున్నదే తడవుగా ప్రత్యేక జీవో ద్వారా నిధులను విడుదల చేసి నిర్మాణ పనుల ను వేగవంతం చేశారు. ఈ క్రమంలో కరోనా మహమ్మారి కారణంగా నిర్మాణ పనులు కొం చెం ఆలస్యమయ్యాయి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు చంకలు గుద్దుతూ మేమేదో చేశామన్నట్టు ఊకదంపుడు రాతలతో నిజాలను అబద్ధాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నది. చెరిపేస్తే చరిత్ర చెరిగిపోతుందా? నిజానిజాలేమిటో ప్రజలకూ తెలుసు. రాష్ట్రవ్యాప్తంగా చూసుకున్నట్టయితే వెలుగులు విరజిమ్మేలా.. కండ్లు మైమరిచేలా దశాబ్ద కాలంలో జరిగిన అభివృద్ధే తప్ప.. రాష్ట్రంలో గత ఏడాది కాలం గా జరిగిన అభివృద్ధి శూన్యం అనేది నూటికి నూరుపాళ్లు నిజం. నాటి ప్రభుత్వ ప్రగతి చక్రాలతో వరంగల్ జిల్లా వ్యాప్తంగా విద్య, వైద్యం, పర్యాటకం, సాంస్కృతిక, ఉపాధి అన్నిరంగా ల్లో కేసీఆర్ తనదైన ప్రత్యేక చొరవను చూపించారు. ఒక్క వరంగల్ జిల్లానే కాదు, రాష్ట్రం మొత్తం అభివృద్ధి పథంలో దూసుకుపోయిం ది. కానీ, నేడు రాష్ట్రంలో చీకట్లు అలుముకున్నాయి. దశాబ్ద కాలపు అభివృద్ధిపై కారుమబ్బులు కమ్ముకున్నాయి. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చా క పచ్చగా ఉన్న ప్రాంతం ఒక్కసారిగా తీరు మారింది. ఇది నేనొక్కదాన్నే చెప్తున్న వాస్తవం కాదు, రాష్ట్ర పరిస్థితిని చూసిన ప్రజలందరూ ముక్తకంఠంతో ఘోషిస్తున్నది. రాష్ట్రానికి రెండో రాజధానిగా వరంగల్ జిల్లాకు ప్రాణం పోసిందే బీఆర్ఎస్ ప్రభుత్వం.

హైదరాబాద్ అభివృద్ధికి ఏ మాత్రం తీసిపోకుండా వరంగల్‌కు అంతే ప్రాధాన్యం కల్పించింది తెలంగాణ తొలి ప్రభుత్వం. అభివృద్ధికి చిరునామాగా మారుస్తూ జాతీయ కంపెనీ మెగా టెక్స్‌టైల్ పార్కును సైతం తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించిన ఘనత నాటి కేసీఆర్ ప్రభుత్వానిది. అభివృద్ధి పథాన దూసుకువెళ్తున్న తెలంగాణను అణగదొక్కాలని నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాడు ఆంధ్రా తొత్తులతో కలిసి కుట్రలు చేసిన విషయం తెలంగాణలోని ప్రతీ పౌరునికి తెలుసు. ఆ కుట్రలను ఛేదించి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రత్యేక ఖ్యాతిని గడించి యావత్ ప్రపంచాన్ని మనవైపు తిప్పుకునేలా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. నిరంత రం అభివృద్ధి మంత్రంతో, సంక్షేమ పథకాల తో, ప్రజారంజకమైన పరిపాలనను అంది స్తూ.. సబ్బండ వర్గాలను గుండెకు హత్తుకున్న చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిది. ఈ ప్రాంత బిడ్డ పీవీ నరసింహారావు దేశ ప్రధానిగా ఎన్నో సంస్కరణలతో దేశానికి వన్నె తెస్తే, ఢిల్లీలో తన చితికి కట్టెపుల్ల కూడా ఇవ్వని కాంగ్రెస్ పార్టీ పీవీ గురించి మాట్లాడటం మరీ విడ్డూరం. జాతీయ రహదారులకు, తెలంగాణ రాష్ట్ర అంతర్గత రోడ్లను అనుసంధానం చేస్తూ అభివృద్ధి చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది. నిజాలను, అబద్ధాలుగా మలచాలని చూసినా, అబద్ధాలను నిజాలుగా చేయాలనే ప్రయత్నం చేసినా చరిత్ర ఒప్పుకోదు గాక ఒప్పుకోదు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వైద్య రంగానికి సరితూగేలా వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తం గా మెడికల్ కాలేజీలు నిర్మించడమే కాకుండా వరంగల్ నడిబొడ్డున కార్పొరేట్‌ను తలదన్నే లా 24 అంతస్థులతో బహుళ ప్రజా దవాఖాన నిర్మాణం చేపట్టిన ఘనత బీఆర్ఎస్‌ది. శతాబ్ద కాలంలో జరగని అభివృద్ధిని, బీఆర్ఎస్ ప్రభు త్వం దశాబ్ద కాలంలోనే చేసి చూపెట్టి మాది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వం అని నిరూపించింది. మీ తండ్రి అయిన కడియం శ్రీహరి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా చేసిన వ్యాఖ్యలను ఒకసారి గుర్తుచేసుకో. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దోచుకొని అధిష్ఠానానికి చేరవేయడమే తప్ప అంతకుమించిందేమీ ఉండదు. తెలంగాణ రాష్ట్రం నలువైపులా మరింత అభివృద్ధి సాధించాలంటే అదొక్క బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని తెలుసుకో. మణిపూర్ లాంటి ఘటనలు రాష్ట్రంలో ఎన్నో చూస్తున్నాం. అయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలగడం లేదు. ఢిల్లీకి డబ్బు ల మూటలు అప్పజెప్పడంతోనే ఆ పార్టీకి సరిపోతున్నది. అధికార జులుంతో, పోలీసు బలగాలతో గిరిజన తండాలపై దాడులు చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది. గిరిజనులు తమ భూములను అప్పనంగా అప్పజెప్పాలని రైతులకు సంకెళ్లతో బేడీ లు వేసి, అమాయకులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన రాక్షస ప్రభుత్వం ఇది. ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యం అంటూ పోలీసు బలగాలతో చేస్తు న్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా కాంగ్రెస్ చరిత్రలో మిగిలిపోవడం ఖాయం.

# గుండెల్ని పిండే కాలుష్యం



భారతీయ నగరాల్లో పెరిగిపోతున్న వాయు కాలుష్యం వల్ల గుండెజబ్బులున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం వస్తున్నది. వాయుకాలుష్యం ఇతరులకంటే గుండె జబ్బులున్నవారికి మరింత ప్రాణాంతకమని అమెరికా పరిశోధకులు గుర్తించారు. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సంస్థలతో కలిసి ఇంటర్‌మౌంటెన్ హెల్త్ సంస్థకు చెందిన పరిశోధకులు వాయు కాలుష్యం వల్ల ఆరోగ్య దుష్ప్రభావాలపై అధ్యయనం నిర్వహించారు. క్యూబిక్ మీటర్ గాలిలో 7 నుంచి 20 మైక్రోగ్రాముల కాలుష్య కారకాలు ఉన్న ఢిల్లీ మరికొన్ని నగరాల్లో ఈ అధ్యయనం నిర్వహించారు. గాలి కాలుష్యం 2.5 పీఎం స్థాయిలో ఉన్న ప్రాంతాల్లోని సాధారణ ప్రజలు, గుండె జబ్బుతో బాధపడే వారి నుంచి రక్త నమూనాలను సేకరించి అధ్యయనం చేశారు. వాయు కాలుష్యం వల్ల గుండె జబ్బు బాధితుల రక్త నమూనాల్లో అనేక అనారోగ్యకారకమైన మార్పులు గుర్తించారు. గుండె జబ్బులు ఉన్నవాళ్ల రక్త నమూనాల్లో ఇన్‌ఫ్లమేటరీ బయోమేకర్స్ (%జజూ27, ×ూ%-18) చాలా ఎక్కువగా ఉన్నాయని తేలింది. గుండె జబ్బులు లేనివాళ్లలో ఏ మార్పూ కనిపించలేదు. హృద్రోగులు వాయు కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రదేశాలకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉందని ఈ అధ్యయనం చెబుతున్నది. ఎంత జాగ్రత్తగా ఉంటే గుండెకు అంత మంచిది.

# చారిత్రక విభాత సంధ్యలు..కడపటి యుద్ధం

బండి నారాయణ స్వామి పదార్థ నియమాలను, భౌతిక పరిమితులను జయించిన సృజనకారుడు. ఇంకేముంది. అలవోకగా తన రెకలు ఆర్చుకొని, ఆ రెకల మీద మనలను (పాఠకులను) కూర్చుండబెట్టి, 16వ శతాబ్దంలోకి తిరోగమించి, విజయనగర సామ్రాజ్యపు రాచరిక వైభవాన్ని.. అకడి జన జాతుల సామూహిక జీవన విశిష్టతను సజీవ దృశ్యంగా కంట చూపారు.కడపటి యుద్ధం నవల అనటం కంటే..620పేజీల ఆదిహిందూ జనజాతుల చారిత్రక దృశ్యకావ్యం అనటం సమంజసం. వీరం, క్రోధం, మోహం, లోభం, శృంగారం, బీభత్సం, భయానక, అద్భుత రసాలు సమ్మిళితమై అద్వితీయమైన రసానుభూతిని కలిగిస్తుంది.రాచరిక చరిత్ర అంతా నెత్తుటి పొద్దుతోనే మొదలవుతుంది. నెత్తుట్లోనే పారాడి పారాడి నెత్తుటి చెమ్మతోనే ముగుస్తుంది. అట్లే.. నెత్తుటి పొద్దుతోనే కడపటి యుద్ధం తొలి పుట మొదలయ్యింది. ఏనుగు అంతటి అళియ రామరాయల వారి కథ నెత్తుటి ముద్దగానే ముగిసిపోతుంది. రాజులు.. కుట్రలు..కత్తులు.. నెత్తుర్లు.. కొత్తేమీ కాదు. కానీ నారాయణ స్వామి తనకే సొంతమైన అద్భుత కాల్పనిక శక్తితో ప్రతిపుటను దృశ్యాల దొంతరగా రూపొందించారు.మహాభారతంలో ఎన్నిరకాల మనస్తత్వాలు గోచరిస్తాయో .. కడపటి యుద్ధ కావ్యంలో అంతకు మించిన వ్యక్తిత్వాలు అనుభవంలోకి వచ్చాయి. హంపణ్ణ యక్షిణి- ప్రేమ సల్లాపం. అలివేలు- శ్రీనివాసరెడ్డి భగ్న ప్రేమ విలాపం.. ఉపపతితో తెలుగుల మాధవుడు రెండవ భార్య కలాపం.. దేవదాసీ రత్నమాల పొందు కోసం కత్తి పట్టిన టిట్టిభశెట్టి వీరత్వం.. బానిస మహిళ కోసం శెట్టి ఉబలాటం. ముస్లిం పాదుషాల మత మర్మం.. గోలొండ సామ్రాట్ ఇబ్రహీం కుతంత్రం.. అళియ రామరాయల వారి రాజసం.. రాజకీయం.. ముస్లిం సైనికుల మతతత్వం.. ఎన్నని చెప్పను నవల నిండా సజీవపాత్రలే.

మహాభారత కావ్యం హస్తినాపురం చక్రవర్తులు, రాజులు, సామంతులు, రాణివాసాల పాత్రలకు.. రాచరికపు కొలువు కూటాల మంత్రాంగాలు, కుట్రలు, కుతంత్రాలు, ఎత్తులు, జిత్తులకే పరిమితమైంది. కానీ కడపటి యుద్ధం హంపి నగర రాజ సౌధాలను దాటుకొని పంచమవాడలోకి ప్రవేశించింది. అకడి నుండి తురకవాడకు..అట్లా ఏడు ప్రాకారాల నడుమనున్న ఒకో సామాజిక జన జాతుల సమూహాల జీవన పార్శ్వాన్ని తడిమి చూపించింది. అకలవాడన మద్యం తిత్తుల మైకం.. బానిస స్త్రీల వేలం.. భోగం సానులతో శృంగారం.. దేవదాసీ సౌధం.. అందలి గోడల మీద చిత్రకళా చాతుర్యం.. పోర్చుగీసు వారి వ్యాపారం.. ఎన్నని రాయను. ప్రతి పదసృష్టి ఒక అద్భుతమే. నవల ఆద్యంతం విసుగు, విరామం లేకుండా ఏకబిగిన చదివించింది."కవి కడు స్వతంత్రుడు. స్వతంత్ర వ్యక్తిత్వం వున్నవాడు. అందుకని వాస్తవికతను వాస్తవికతగా చెప్పడు. వాస్తవికతకు వ్యక్తిత్వంతో స్పందించి సృజించడమే కళ అని కవికి తెలుసు" అంటుంది భాగీరథి. ఈమె భోగం సాని కూతురు. అప్పటికి ఆమె గోలొండ యువరాజు ఇబ్రహీం ప్రేయసి. ఈ మాట ముమ్మాటికి ఈ నవల రచయిత బండి నారాయణస్వామి వ్యక్తిత్వమే. చారిత్రక వాస్తవానికి సృజన జోడించి నిషర్షగా, నిర్మోహమాటంగా ఎత్తి చూపారు. మతం అప్రజాస్వామికమైనది అని తేల్చి చెప్పారు. అయితే సామాజికంగా, సాంస్కృతికంగా సమాజంలో సమ్మిళితమై ఉన్న మతపార్శ్వాన్ని తృణీకరించలేని నగ్న సత్యాన్ని ప్రతిభావంతమైన పాత్రల ద్వారా ఎత్తిచూపారు.అనేక సజీవ పాత్రల నడుమ నా మనసుకు అద్భుతం.. అబ్బురం అనిపించిన అభినేతలు ఇద్దరు. ఒకరు ఉత్తణ్ణ. ఇంకొకరు నల్లజ్జ. పరస్పర విరుద్ధ స్వభావమున్న పాత్రలు. బండి నారాయణ స్వామి అద్భుత సృష్టికి ప్రతిరూపాలు. ఉత్తణ్ణ.. ఉత్తముడు.. పంచముడు..చర్మకారుడుడ నిర్వికారుడు.. జ్ఞాన సంపన్నుడు.. అన్నిటికీ మించి వీరవైష్ణవ భక్తి ఉద్యమకారుడు. ఈ పంచముని గుడిసెకు సాక్షాత్తు శ్రీరామ చంద్రుడే ఏతెంచి తన భక్తుడు హన్మంతునికి పాదరక్షలు కుట్టడం అనేది అనన్య సామాన్య కల్పన. పంచమున్ని అచంచలమైన దైవిక కొండ అంచున నిలబెట్టిన ప్రయత్నం. ఉత్తణ్ణ పాత్రలో నాకు సాక్షాత్తు బండి నారాయణ స్వామి గారు సాక్షాతరించారు. వారితో నాకు పరిచయ భాగ్యం బహు స్వల్పకాలమే కానీ, నిరాకారి వెర్రి తన్మయం ఏదో స్వామి గారి చుట్టూ ఆవహిస్తుంది అనిపించింది.ఇంకొకరు నల్లజ్జ. నిర్లజ్జకు నిలువెత్తు రూపం.వ్యసనపరుడు..బోగ లాలసుడు.. జ్ఞాన హీనుడు. మహిళా వస్తాదు చినపోతి భర్త. వేశ్య ప్రాపాలిక ఇష్ట ప్రియుడు. నల్లప్రజ నాయకుడు. నల్లప్రజ అంటే దొంగల దండు. యుద్ధానికి ముందు రాయలవారు శత్రు రాజ్య గ్రామాల మీద రాయలు ప్రయోగించే లూటీ ముఠా. నల్లజ్జ పాపభీతి, ప్రాణభయం లేని యోధుడు. ఈ మొండి తనమే ఆఖరి నిమిషంలో అతని ప్రాణం నిలిపింది.'అన్నమయ్య మన సంప్రదాయక ఆధ్యాత్మికతకు తన వ్యక్తిగత అనుభూతిని, అనుభవాన్ని జోడిస్తాడు. అతడు మొత్తం 89భిన్న స్వరరాగాలను ప్రయోగించి ఉంటారు' అని అళియ రామరాయల వారు తన ఇష్టసఖి తిరుమలాంబకు వచించిన సందర్భం.. అనంతరం పుణ్య దంపతుల మధ్య సాగిన సాహితీ సంభాషణ నారాయణ స్వామి గారి సాహిత్య జ్ఞానానికి ప్రతిరూపం. దేవుడు.. దెయ్యం.. మత విశ్వాసాలు లేని హంపణ్ణ ఆఖరికి దేవతా విగ్రహాలను రక్షించే బాధ్యతలు మోయటం కొసమెరుపు. హిందూ ఆలయాల విధ్వంసకుడు, ముస్లిం యుద్ధ వీరుడైన రెహమాన్ హంపణ్ణకు తోడు నిలబడటం కథలో మరో ట్విస్టు .గొప్ప చారిత్రక నవలకు జీవం పోసి నడిపించిన ఈ సాహితీ జ్ఞాని కృషి అపురూపం, అద్వితీయం అని చెప్పక తప్పదు.

# బర్త్ డేకి గ్రాండ్‌గా...

అభిమాన హీరో పుట్టినరోజు దగ్గర పడుతోందంటే అభిమానులు ఆ హీరో తాజా చిత్రాల అప్‌డేట్స్‌ని ఆశిస్తారు. ప్రస్తుతం ఎన్టీఆర్ అభిమానులు అలానే అప్‌డేట్స్ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నెల 20న ఈ హీరో పుట్టినరోజు. ఈ సందర్భంగా ఫ్యాన్స్ ఆశించేవాటిలో ఎన్టీఆర్ హీరోగా త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమా ఒకటి. బర్త్ డేకి గ్రాండ్‌గా ఒక వీడియోను విడుదల చేయడానికి ఈ టీమ్ సన్నాహాలు చేస్తోందని సమాచారం. ఈ వీడియోలో విజువల్ ఎఫెక్ట్స్ భారీగా ఉంటాయని టాక్. కుమార స్వామి నేపథ్యంలో త్రివిక్రమ్ తెరకెక్కించనున్న ఈ మైథలాజికల్ మూవీకి 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు ఓ వార్త ప్రచారంలో ఉంది. మరి... ప్రచారంలో ఉన్నట్లు వీడియోను విడుదల చేస్తారా? ఆ రోజు టైటిల్‌ని కూడా ప్రకటిస్తారా? అనేది వేచి చూడాల్సిందే. ఇక ఈ సినిమా అంగీకరించాక కుమార స్వామి గురించి తెలుసుకోవడానికి ఎన్టీఆర్ పుస్తకాలు చదువుతున్నారట. ఇదిలా ఉంటే... ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్నారు ఎన్టీఆర్. అలాగే 'దేవర' రెండో భాగం కూడా ఉంది.





# హృదయాన్ని కదిలిస్తుంది

హృదయాల్ని స్పృశించే అందమైన భావోద్వేగాలతో 'గోదారి గట్టుపైన' చిత్రాన్ని తెరకెక్కించామని, ఈ వేసవిలో అందరూ ఫ్యామిలీతో కలిసి చూడాల్సిన సినిమా ఇదని అన్నారు చిత్ర కథానాయకుడు సుమంత్ ప్రభాస్. సుభాష్‌చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. బుధవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ పైవిధంగా స్పందించారు. మానవ విలువలు ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, ఈ సినిమా చూశాక తండ్రీకూతుళ్ల అనుబంధం తాలూకు గాఢత అర్థమవుతుందని, ప్రతీ అమ్మాయి వాళ్ల నాన్నకు ఫోన్‌చేసి 'ఐ లవ్ యూ డాడీ' అని చెబుతుందని సుమంత్ ప్రభాస్ అన్నారు. కూతురిని అమితంగా ప్రేమించే తండ్రి కథ ఇదని దర్శకుడు సుభాష్‌చంద్ర తెలిపారు. థియేటర్‌లో చూసి ఫీల్ కావాల్సిన సినిమా ఇదని నిర్మాత అభినవ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.



# మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్

త్రిగుణ్, పాయల్ రాధాకృష్ణ , అనీష్ కురువిల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ చెలికాని దర్శకుడు. అరవింద్ మాండ్యం నిర్మాత. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈనెల 15న విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్‌ని నిర్వహించారు. 'మనం నిజజీవితంలో చూసే పాత్రలు, సంఘటనలతో కూడిన ప్రేమకథ ఇది. ఈ ప్రేమకథలోని సంఘర్షణ అందరికీ కనెక్టయ్యేలా ఉంటుంది. అందరికీ గుర్తుండిపోయే సినిమా ఇది' అని దర్శకుడు మధుదీప్ నమ్మకం వ్యక్తంచేశారు. ఇంకా నిర్మాత అరవింద్, హీరోహీరోయిన్లు త్రిగుణ్, పాయల్ రాధాకృష్ణ, పంపిణీదారుడు ముత్యాల రాందాస్ కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: రవికుమార్.వి, సంగీతం: ప్రకాశ్ చెరుకూరి, అరుణ్ చిలువేరు, సమర్పణ: సీహెచ్‌వీఎస్ఎన్ బాబ్జీ, నిర్మాణం: లోటస్ క్రియేటివ్ వర్క్స్.

# వినోదాన్ని పంచే 'పురుషః'



పవన్‌కల్యాణ్ బత్తుల హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'పురుషః'. వీరు వులవల దర్శకత్వం వహిస్తున్నారు. బత్తుల కోటేశ్వర రావు నిర్మాత. ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకురాబోతున్నది. గురువారం రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ..విభిన్న కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించామని, ఆద్యంతం వినోదంతో మెప్పిస్తుందని అన్నారు. ప్రచార చిత్రాలకు వచ్చిన స్పందన సినిమా విజయంపై నమ్మకాన్ని పెంచిందని నిర్మాత చెప్పారు. సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి శ్రవణ్ భరద్వాజ్ సంగీతాన్నందిస్తున్నారు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.